




నాడు మొక్కుబడి

నెరవేరని జలసిరి

రైతుల కల మన వైఎస్ఆర్ జలకళ అనే నినాదంతో ప్రవేశపెట్టిన జలకళ పథకం కలగానే మిగిలింది. వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ బోర్ల నిర్మాణాన్ని అటకెక్కిం చింది. మొక్కుబడిగా ఈ పథకాన్ని అమలు చేసి ఆ ప్రభుత్వం చేతు లు దులుపుకుంది. రైతుల ప్రయోజనాలకు పెద్ద పీట వేశామని గొప్పలు చెపుకున్న ప్రభుత్వం బోర్ల నిర్మాణాన్ని చేపట్టలేదు. పల్నా డు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో 15,341 మంది రైతు లు దరఖాస్తులను ఆమోదించినప్పటికీ గత ఐదేళ్లలో 2,208 బోర్లు మాత్రమే నిర్మించారు. విద్యుత్ కనెక్షన్‌లు లేక వందలాది బోర్లు నిరుపయోంగా ఉన్నాయి. నాడు తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఎన్‌టీఆర్ జలసిరి పథకాన్ని ప్రవేశపెట్టి రైతులకు వ్యవసాయ బోర్లు నిర్మించారు. సోలార్ పంపు సెట్లను ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జలసిరిని మళ్లీ అమలు చేస్తారని, బోర్ల నిర్మాణంపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయం కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.

- తూతూమంత్రంగా బోరుల నిర్మాణం
- వైసీపీ ప్రభుత్వంలో అంతులేని నిర్లక్ష్యం
- కూటమి ప్రభుత్వం నిర్ణయం కోసం రైతుల చూపు

బోర్ల నిర్మాణం క్లస్టర్‌ల వారీగా ఇలా ..

క్లస్టర్	దరఖాస్తులు	ఆమోదించినవి	నిర్మించినవి
నరసరావుపేట	823	715	104
సత్తెనపల్లి	1,894	1,532	134
మాచర్ల	5,061	4,170	741
వినుకొండ	2,563	1,954	200
గుంటూరు	197	157	11
తెనాలి	279	229	122
బాపట్ల	314	236	75
చీరాల	4210	3492	821
మొత్తం	15,341	12,485	2,208

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

చిన్న సన్న కారు రైతుల ప్రయోజనాల కోసం వ్యవసాయం బోరు బావులను ఉచితంగా నిర్మించేందుకు ఈ పథకాన్ని ప్రభుత్వం అర్భాటంగా ప్రవేశపెట్టి అమలులోకి తీసుకొచ్చింది. చిన్న, సన్న కారు రైతుల వ్యవసాయ భూమిని సేద్యానికి అనుకూలంగా మార్చేందుకు, భూగర్భ జలాలను సమర్థవంతంగా సద్వినియోగం చేసుకొనేందుకు ప్రవేశపెట్టిన బోర్ల నిర్మాణం పథకం వారికి అక్కరకు రాలేదు. బోర్ల నిర్మాణం కోసం ఆశగా ఎదురు చూసిన అన్నదాతలకు అడియాసే మిగిలింది. ఈ పథకానికి ప్రధానంగా నిధుల కొరత వెంటాడింది. నిర్మించిన బోర్లకు పూర్తి స్థాయిలో బిల్లుల చెల్లింపులు జరగకపోవడంతో బోర్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. నిర్మాణం పూర్తయిన బోర్లకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వలేకపోయారు. దీంతో వందలాది బోర్లు నిరూపయోగంగా మారాయి. నెలల తరబడి విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వకపోవడంతో అవి పూడి పోయే పరిస్థితులు నెలకొంటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా వదిలేసిన బోరు

- పల్నాడు జిల్లాల్లో 10,341 మంది రెతులు బోర్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేశారు. వీటిలో 8,371 దరఖాస్తులను ఆమోదించినప్పటికీ 1,179 బోర్లు మాత్రమే నిర్మించారు. నిధుల కొరతతో బోర్లు నిర్మాణం నిలిచిపోయింది. బోర్లకు మోటార్లు అమర్చడంలో, విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరిగింది. విద్యుత్ కనె క్షన్‌లు లేక వందలాది బోర్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఖరీఫ్ సీజన్‌లలో బోర్లు అందుబాటులోకి రాకపోవడంతో వేలాది మంది రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.
- బాపట్ల జిల్లాలో 4524 మంది రైతులు దరఖాస్తు చేసు కున్నారు. వీటిలో 3,728 దరఖాస్తులను ఆమోదించారు. 2279 భూగర్భ జలాల లభ్యతకు సంబంధించి సర్వే పూర్తి చేశారు. సర్వే నివేదిక ఇచ్చిన దరఖాస్తులలో 2105 బోర్లు నిర్మాణానికి అనుమతిచ్చారు. వీటిలో 1779 బోర్లకు పరి పాలన అనుమతి ఇచ్చారు. 896 బోర్లను మాత్రమే నిర్మిం చారు. నిర్మించిన బోర్లలో 63 బోర్లు విఫలమైనట్టు గుర్తిం చారు. 42 బోర్లకు విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చారు.
- గుంటూరు జిల్లాలో 476 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా 386 దరఖాస్తులను అమోదించారు. 181 భూగర్భ జలాల లభ్యతకు సంబంధించి సర్వే పూర్తి చేశారు. సర్వే నివేదిక ఇచ్చిన దరఖాస్తులలో 197 బోర్లు నిర్మాణానికి అనుమతిచ్చారు. వీటిలో 170 బోర్లకు పరిపాలన అనుమతి ఇచ్చారు. 133 బోర్లను మాత్రమే నిర్మించగా వీటిలో 34 బోర్లు పనిచేయడం లేదని నిర్ధారించారు. 44 బోర్లకు విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చారు.

ఎన్‌టీఆర్ జలసిరిని పునరుద్ధరించేనా ?

నాడు తెలుగుదేశం ప్రభుత్వం ఎన్టీఆర్ జలసిరి పథకం పేరుతో వ్యవసాయ బోర్ల నిర్మాణాన్ని పథకాన్ని అమలు చేసింది. ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న సన్న, చిన్న కారు రైతుల కోసం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టి విజయవంతంగా నిర్వహించారు. బోరు నిర్మించడంతో పాటు దీనికి సోలార్ పంపు సెట్ కూడా ఏర్పాటు చేశారు. జలసిరి పథకాన్ని జలకళగా మార్చిన వైసీపీ ప్రభుత్వం బోర్ల నిర్మాణం నామమాత్రంగా కూడా చేయలేదు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడంతో బోర్ల నిర్మాణంపై రైతుల్లో ఆశలు చిగురించాయి. జలసిరి పథకం మళ్లీ అమలు చేస్తారని ఎదరు చూస్తున్నారు. ముఖ్యంగా పల్నాడు జిల్లాలో సాగు నీటి కరువు నెలకొంటోంది. దీంతో సాగుకు వ్యవసాయ బోర్లు ఆధారమవుతు న్నాయి. ప్రభుత్వం జలసిరి అమలుపై ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ప్రభుత్వం నిర్ణయం కోసం అన్నదాతలు ఎదురు చూస్తున్నారు.





తెలుగుదేశం ప్రభుత్వం నిర్మించిన వ్యవసాయ బోర్లు.. సోలార్ పంపు సెట్లు



గుంటూరు కేవీపీ కాలనీలో ఇంకా సిద్ధం కానీ పాఠశాల భవనం

- ఉమ్మడి జిల్లాలోరూ. 600 కోట్లుకు పైగా వ్యయం
- తల్లిదండ్రుల కమిటీ పేరుతో వైసీపీ నేతలకు కాంట్రాక్టులు
- నేటికి నిర్మాణ దశలోనే భవనాలు... వాటర్‌ప్లాంట్స్ నిర్వహణ గాలికి

నాడు-నేడు అక్రమాలపై

విచారణ

గుంటూరు(విద్య)జులై 29: ఉమ్మడి జిల్లాలో మనబడి నాడు-నేడుపేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన అక్రమాలపై విచారణకు రంగం సిద్ధం అయింది. ఇటీవల అసెంబ్లీలో సైతం జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు నాడు నేడు అక్రమాలపై విచారణ చేయాలని విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో అక్రమాలపై విచారణకు కార్యచరణ సిద్ధం అయింది. క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించి అక్రమాలను నిగ్గుతేల్చనున్నారు. ఇందుకు బాధ్యులైన అధికారులపై వేటు వేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

ఉమ్మడి జిల్లాలో మన బడి, నాడు నేడు తొలి దశలో 1149 పాఠశాలలను ఎంపిక చేసి దాదాపు రూ. 325 కోట్లుకుపైగా ఖర్చుచే సిన ట్లు స వ ా చారం. రెండోదశలో 1344 పాఠశాలలను ఎంపిక చేసి మరో 340 కోట్లు వెచ్చించి ఆధునీకరణ పనులు ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుల ప్రమాణాలు పెంచటం, మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా గత ప్రభుత్వంలో మొదలైన పనులు ఇంకా పూర్తికాలేదు. శిథిలమైన ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దుతున్నామనే ముసుగుతో అస్మదీయులకు తల్లిదండ్రుల కమిటీ మాటున కాంట్రాక్టులు కట్టబెట్టి భారీ స్థాయిలో వైసీపీ నాయకులు దోచుకున్నారనే ఆరోపణలు మొదటి నుంచి వస్తున్నాయి. తాగునీరు, టాయిలెట్, ఫర్నిచర్, కాంపౌండ్‌వాల్, పెయింటింగు, మరమ్మతులు, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు ఏర్పాటు, వంటగది నిర్మాణం, ఇంగ్లీషు మీడియం ల్యాబ్‌లు ఏర్పాటు పేరుతో పెద్ద మొత్తంలో కమీషన్లు దండుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మారుమూల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సైతం కార్పొరేట్ కట్టడాలకు దీటుగా తీర్చిదిద్ది విద్యా వికాసానికి బాటలు వేస్తున్నామని నాటి ప్రభుత్వం చేసిన వాగ్దానాలు నీటిమీద రాతలేనని స్పష్టం అయింది. దానికి ప్రత్యక్ష నిదర్శనం నేటికి పూర్తికాని భవనాలే.

నిర్మాణ దశలోనే పనులు..

ఉమ్మడి జిల్లాలో నాడు నేడు పనులు 2021లో ప్రారంభించారు. అంటే దాదాపు అయిదేళ్ళు పూర్తి కావస్తున్నా పనులు ఇంకా పూర్తికాలేదు. ప్రతి నియోజక వర్గంలో వైసీపీ నేతలే ఈ పనులు చేశారు. అనేక చోట్ల పనుల్లో నాణ్యత లోపం కనిస్తున్నా బిల్లులు చెల్లింపు మాత్రం యధేచ్ఛగా సాగించారు. జిల్లాలో మొదటి విడత ఏర్పాటు చేసిన మినరల్‌వాటర్ ప్లాంటులు ఇప్పుడు దాదాపు మూతపడ్డాయి. కాంట్రాక్టు ఏజన్సీ ఐదేళ్ల పాటు మరమ్మతులు చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. రెండో దశలో కూడా సంవత్సరం క్రితం అనేక స్కూల్స్‌కు వాటర్ ప్లాంట్లు వచ్చాయి. వీటిని ఇంత వరకు వినియోగం లోకి తీసుకురాలేదు.

తూతూ మంత్రంగా పర్యవేక్షణ

నాడు నేడు పనుల పర్యవేక్షణను ఇటు విద్యాశాఖ, అటు సమగ్రశిక్ష అధికారులు అసలు పట్టించుకోవడం లేదు. పనుల పురోగతిని యాప్స్‌లో నమోదు చేయమని ఉపాధ్యాయలకు ఆదేశాలు ఇవ్వడం తప్ప క్షేత్రస్థాయిలో నాణ్యత, పనుల వేగం గురించి ప్రశ్నించిన దాఖలాలు లేవు. దీంతో నాడు నేడు పనులు జిల్లాలో ఇష్టారాజ్యంగా సాగాయి. కొంతమంది అధికారులు ఇందుకు ఇతోధికంగా సహకారం అందించి బిల్లుల మంజూరులో భారీ స్థాయిలో కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు దండుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇందులో మిలాఖత్ అయ్యారని ఫిర్యాదులు ఉన్నాయి.


పాసు పుస్తకాలపై రాజముద్ర

రెవెన్యూ శాఖను ఆదేశించిన సీఎం చంద్రబాబు నాయుడు ● కొత్త పుస్తకాలకు క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆస్తి వివరాలు, అడ్రస్ ● తన బొమ్మ కోసం రూ.15 కోట్లు వృధా చేసిన జగన్

గుంటూరు సిటీ ,జూలై 29 : భూ యజమానులకు శుభవార్త. త్వరలో కొత్త పాసు పుస కాలు ఇచ్చేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఇవ్వబోయే పాసు పుస్తకాలపై రాజముద్రను ముద్రించనున్నారు.ఈ మేరకు రెవెన్యూ శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబునాయుడు అధికారులకు పలు సూచనలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కీలకమైన విషయాలపై దృష్టి సారించిన సీఎం పాసు పుస్తకాలపై జగన్ బొమ్మను ముద్రించి పంపిణీ చేయటం వల్ల భూ యజమానుల్లో నెలకొన్న ఆందోళనపై చర్యలు చేపట్టారు. పాసు పుస్తకాలపై వ్యక్తుల ఫోటోలు ఉండటం వల్ల ప్రజల్లో అనేక రకాల భయభ్రాం తులు నెలకొన్న సంగతి ఎన్నికల సందర్భంగా బహి ర్గతం అయ్యింది. చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో కూడా చాలా మంది రైతులు, భూ యజమానులు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తమ ఆస్తుల పత్రాల పై జగన్ బొమ్మ లు ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చాక పాసు పుస్తకాలు మారుస్తామని చంద్రబాబు నాయుడు హామీ కూడా ఇచ్చారు.ఈ నేపథ్యంలో ప్రచార పిచ్చి తో జగన్ ప్రభుత్వం అడ్డగోలుగా రెవెన్యూ శాఖలో తీసుకున్న నిర్ణయాలపై సీఎం సమీక్ష నిర్వహించి కొత్త పుస్తకాలు రాజముద్రతో ఉండాలని అధికారులను ఆదేశించారు.

లోన్లు ఇవ్వని బ్యాంకర్లు

ప్రస్తుతం భూ యజమానుల వద్ద వున్న పాసు పుస్తకాలపై జగన్ మోహన్ రెడ్డి బొమ్మను ముద్రించారు. కేవలం ముందు పేజీలో మాత్రమే కాకుం డా, లోపల ఉన్న ప్రతి పేజీలోను ఆయన బొమ్మలు ఉన్నాయి. ఈ పుస్తకాలు తీసుకొని బ్యాంకర్ల వద్దకు వెళ్తే రుణాలు ఇవ్వమని మొఖం మీదే చెప్పేసి రైతులను బ్యాంకుల నుండి బయటకు పంపారు. ఇది అన్ని పార్టీల నేతలు, కార్యకర్తలు, అభిమానులకు బాగా ఇబ్బంది కరంగా అనిపించింది. జగన్ బొమ్మ పాసు పుస్తకాలపై వేయటం వల్ల కొందరు అసలు తమకు ఆ పుస్తకాలు వద్దని తిరిగి గ్రామ సచివాలయంలో నే వాటిని ఇచ్చేసి వెళ్లారు. తమ తాతలు,తండ్రులు కష్టపడి సంపాదించిన ఆస్తులపై జగన్ బొమ్మ వేస్తే పాసు పుస్తకాలు ఎందుకు తీసుకుంటామని చాలా మంది భూ యజమానులు అధికారులకు ఎదురు తిరిగారు.గత ఎన్నికల్లో జగన్ ఓటమికి ఇదొక కారణంగా కనపడుతుంది.



గతంలో ఎన్నడూ లేదు..

పాసు పుస్తకాలపై 2019 కి ముందు ఉన్న ప్రభుత్వాలు సీఎంల ఫోటోలను ముద్రించిన దాఖలాలు లేవు. ఏ ప్రభుత్వం ఉన్న రాజముద్రతోనే పాసు పుస్తకాలు పంపిణీ చేసేవారు. జగన్ అధికారంలోకి వచ్చాక భూ యజమానులు అత్యంత భద్రంగా చూసుకునే పాసు పుస్తకాలపై సీఎం ఫోటోను ముద్రించారు. అందుకోసం రూ. 15 కోట్లు వరకు వృధా చేసినట్లు తెలుస్తోంది.

ఆధునికహంగులు

కొత్త పాసు పుస్తకాలు ఆధునిక హంగులతో రూపుదిద్దుకుంటున్నాయి. నకిలీవి తయారు చేయటానికి వీలు లేకుండా కొత్త పుస్తకాలకు క్యూఆర్ కోడ్‌ను ఇస్తారు. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆస్థి వివరాలు, అడ్రస్ కూడా తెలుస్తుంది. క్యూఆర్ కోడ్‌స్కాన్ చేసి ఆస్థి ఉన్న అడ్రస్ వద్దకు తీసుకువెళ్లే మ్యాప్ కూడా వచ్చేలా ఏర్పాటు చేశారని తెలుస్తోంది .ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న క్యూ ఆర్ కోడ్ విధానం వల్ల భూ యజమానుల ఆస్తులకు భద్రత వంటి ప్రయోజనం కలుగుతుంది.

ఒకటినే పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలి


ఉదయం 5 గంటలకే పంపిణీ ప్రారంభించాలి ● పల్నాడు కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లాలోని పింఛనుదారులందరికీ 1న పింఛన్లు నూరు శాతం పంపిణీ చేయాలని కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన సమావేశంలో పింఛన్లు పంపిణీపై అయన సమీక్షించారు . అందుబాటులో లేని లబ్ధిదారులకు రెండవ తేదీన పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో 1,2 తేదీల్లో మొత్తం పింఛన్లు పంపిణీ కావాలని, ఈ విషయాన్ని ప్రతి గ్రామం, వార్డులో ముందస్తు ప్రచారం చేపట్టాలని అన్నారు. పింఛను డబ్బును 31న బ్యాంకుల నుంచి డ్రా చేసి సిద్ధం చేసుకోవాలని తెలిపారు. 1న ఉదయం 5 గంటల నుంచి పింఛన్లు పంపిణీ ప్రారంభించాలని స్పష్టం చేశారు. అధిక శాతం పింఛనుదారులు ఒకే బ్యాంకు నుంచి పింఛను పొందడం వలన, పంపిణీలో జాప్యం జరిగే అవకాశం ఉందని, అటువంటి సమస్య లేకుండా తమ సమీప బ్యాంకు నుంచి లబ్ధిదారులు పింఛనును పొందేలా తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో 2,79,783 మంది పింఛన్‌దారులు ఉండగా రూ 119,33,54,500 పంపిణీ చేయాలి. మండల ప్రత్యేక అధికారులు పెన్షన్ పంపిణీలో పాల్గొనాలన్నారు..ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం , జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకుడు బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

సాగర్ వైపు కృష్ణమ్మ పరుగులు



శ్రీశైలం నుంచి సాగర్‌కు కృష్ణమ్మ పరుగులు

- శ్రీశైలం నుంచి లక్షన్నర కూసెక్కుల నీరు విడుదల
- ఖరీఫ్‌లో పంటల సాగుకు అనుకూలం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కృష్ణానది పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో జలాశయాలను వరద పోటెత్తుతోంది. శ్రీశైలం జలాశయం నిండు కుండలా మారింది. శ్రీశైలం మూడు గేట్లు తెరచి నాగార్జున సాగర్ జలాశయానికి నీటిని సోమవారం విడుదల చేశారు. విద్యుత్ ఉత్పత్తి, గేట్లు తెరచి దాదాపు లక్షన్నర క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఖరీఫ్ పంటల సాగుకు సాగర్ నీటిపై అన్నదాతల్లో ఆనందం వెల్లువిరుస్తోంది. శ్రీశైలం జలాశయంలోకి సాయంత్రం 6 గంటలకు 4,51,080 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలంలో 215.81 టీఎంసీలకుగాను నీటి నిల్వ 184.28 టీఎంసీలకు చేరింది. శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 63,466 కూసెక్కులు, గేట్ల తెరచి 81,000 కూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డి పాడుకు 18,000 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలశయానికి ఇదే స్థాయిలో వరద మూడు రోజులు కొనసాగుతుందని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. ఇక్కడ నుంచి సాగర్‌కు నీటి విడుదల మంగళవారం మూడు లక్షల కూసెక్కులకు చేరుతుందని అంచనా వేస్తున్నారు.

ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, తుంగభద్ర జలాశయాల నుంచి దాదాపు నాలుగున్నర లక్షల కూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో శ్రీశైలంలో నీటి మట్టం గంటగంటకు పెరుగుతోంది. సాగర్‌లో కూడా నీటి నిల్వ ఆశాజనకంగా పెరుగుతోంది. సాగర్‌లో గత నాలుగు రోజుల్లో 16 టీఎంసీల నీటి నిల్వ పెరిగింది. సాగర్ పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 312.50 టీఎంసీలు కాగా సాయంత్రం 137.60 టీఎంసీలకు చేరింది. సాగర్ నుంచి కుడి కాలువకు 5,944 కూస్కెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఆంధ్ర వర్సిటీలో ఎంబీఏ, ఎంసీఏ

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- ఎంబీఏ, ఎంసీఏ ఫుల్ టైం ప్రోగ్రామ్‌లలో సెల్ఫ్ సపోర్ట్ మోడ్ కేటగిరీ సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏపీఐసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. సీట్లు మిగిలిన పక్షంలో అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ట్యూషన్ ఫీ రీయింబర్స్‌మెంట్ వర్తించదు. స్కాలర్‌షిప్‌లు లభించవు.

ఎంబీఏ

ఎంబీఏ జనరల్ ప్రోగ్రామ్‌తోపాటు మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హెచ్‌ఆర్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. హెచ్‌ఆర్ స్పెషలైజేషన్‌లో 66 సీట్లు; మిగిలిన వాటిలో ఒక్కోదానిలో 44 సీట్లు ఉన్నాయి. ఎంబీఏ(జనరల్, హెచ్‌ఆర్) ప్రోగ్రామ్‌లను ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూఎస్ఐబీ); మిగిలిన స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లను ఏయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్(డీసీఎంఎస్) అందిస్తున్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడేళ్ల వ్యవధి గల ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.1,50,000

ఎంసీఏ

ఏయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 66 సీట్లు ఉన్నాయి.

అర్హత: కనీసం 50% మార్కులతో బీసీఏ/బ్యాచిలర్ డిగ్రీ ఇన్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులు; మేథమెటిక్స్ ఒక సబ్జెక్టుగా ఇంటర్‌తోపాటు బీఎస్సీ/బీకాం/బీఏ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రోగ్రామ్ ఫీజు: రూ.1,25,000

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.600
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 12
- **కౌన్సెలింగ్ తేదీ:** ఆగస్టు 14
- **కౌన్సెలింగ్‌కు తీసుకురావాల్సిన పత్రాలు:** ఏపీ ఐసెట్ 2024 ర్యాంక్ కార్డ్; టీసీ; పదోతరగతి, ఇంటర్/డిప్లొమా, డిగ్రీ సర్టిఫికెట్లు, మార్కుల పత్రాలు; తొమ్మిదో తరగతి నుంచి డిగ్రీ వరకు స్టడీ సర్టిఫికెట్లు; కులం, వైకల్యం ధ్రువీకరణ పత్రాలు
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, ఆంధ్ర యూనివర్సిటీ, విజయనగరం ప్యాలెస్, పెదవాల్తేర్, విశాఖపట్నం-530017
- **వెబ్‌సైట్:** https://audoa.andhrauniversity.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/yArgvZGలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో డిగ్రీ, పీజీ

హైదరాబాద్‌లోని డా. బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్ఏఓయూ)- గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు స్టడీ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు తమకు అనువైనదాన్ని ఎంచుకోవచ్చు. ప్రోగ్రామ్‌లలో భాగంగా కాంటాక్ట్ తరగతులు, ల్యాబొరేటరీ సెషన్స్, అసైన్‌మెంట్స్, వార్షిక పరీక్షలు ఉంటాయి. ఆలిండియా రేడియో ద్వారా నిర్ణీత సమయాల్లో రేడియో పాఠాలు ప్రసారం చేస్తారు.



● డిగ్రీ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి మూడేళ్లు. బీఏ, బీకాం, బీఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీలో ప్రవేశానికి ఇంటర్(సైన్స్) గ్రూపు అభ్యర్థులు అర్హులు. తెలంగాణ ఓపెన్‌స్కూల్ సొసైటీ లేదా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ నుంచి పన్నెండో తరగతి ఉత్తీర్ణులు; పదోతరగతి తరవాత రెండేళ్ల ఐటీఐ/ఒకేషనల్ కోర్సులు చేసినవారు, మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులూ దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు ఇంగ్లీష్ లేదా తెలుగు మాధ్యమాన్ని ఎంచుకోవచ్చు. బీఏ(పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ), బీఎస్సీ(బోటనీ, కెమిస్ట్రీ, జువాలజీ) కోర్సులు ఉర్దూమీడియంలో కూడా అందుబాటులో ఉన్నాయి.

బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. దీనిని తెలుగు/ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుకునే వీలుంది. ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ పూర్తిచేసినవారు; ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు రికార్డు అసిస్టెంట్‌గా ఏడాది అనుభవం లేదా డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సు(లైబ్రరీ సైన్స్) పూర్తిచేసినవారు అర్హులు.

● డిప్లొమా ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి ఏడాది. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన విధంగా సంబంధిత/ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పెషలైజేషన్‌లు: సైకలాజికల్ కౌన్సెలింగ్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఉమెన్ స్టడీస్, హ్యూమన్ రైట్స్, కల్చర్ అండ్ హెరిటేజ్ టూరిజం.

హ్యూమన్ రైట్స్ ప్రోగ్రామ్‌ను తెలుగు మాధ్యమంలో, మిగిలినవాటిని ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

● పీజీ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి రెండేళ్లు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంఏ(జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్) ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌లు మినహా అన్నింటినీ తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

ఎంఏ స్పెషలైజేషన్‌లు: జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఉర్దూ.

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, సైకాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫిజిక్స్, జువాలజీ.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో సంబంధిత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లాంగ్వేజెస్‌లో ఎంఏ కోర్సుకు డిగ్రీలో సంబంధిత లాంగ్వేజ్‌ని సెకండ్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలి. ఎంకాం కోర్సుకు బీబీఏ/బీబీఎం/బీఏ(కామర్స్) అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ (మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్) కోర్సుకు మేథమెటిక్స్ ఒక సబ్జెక్టుగా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ సైకాలజీకి ఏదేని డిగ్రీ పాసైతే చాలు.

మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో మాత్రమే ఈ కోర్సు ఉంది. కనీసం 40 శాతం మార్కులతో బీఎల్ఐఎస్సీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

● సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి ఆర్నెల్లు. విభాగాన్ని అనుసరించి పదో తరగతి/ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు.


విభాగాలు: ఎన్‌జీఓస్ మేనేజ్‌మెంట్, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, లిటరసీ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్.

● ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను ఆంగ్ల మాధ్యమంలో, మిగిలినవాటిని తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 18
- **వెబ్‌సైట్:** www.braou.ac.in

నవ్య | చిత్రజ్యోతి

కంటి చికిత్స కోసం అమెరికాకు?



బాలీవుడ్ నటుడు షారూఖ్‌ఖాన్ అత్యవసర కంటి చికిత్స కోసం అమెరికా వెళ్తున్నట్లు బాలీవుడ్ మీడియాలో వినిపిస్తోంది. ఆయన కంటి సమస్యతో సోమవారం ముంబైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా, అక్కడి వైద్యులు అమెరికా వెళ్లాలని సూచించినట్లు సమాచారం. దీంతో నేడు షారూఖ్ అమెరికా వెళ్లనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ వార్తలపై షారూఖ్ పీఆర్ బృందం ఇంతవరకూ స్పందించలేదు. 2014లో షారూఖ్ కంటికి శస్త్ర చికిత్స జరిగింది. ఆయన ప్రస్తుతం కింగ్ చిత్రంలో నటిస్తున్నారు.

మూర్ఖులను గెలవలేము



ఆరోగ్యానికి సంబంధించిన చిట్కాలను అభిమానులతో పంచుకున్న సమంత వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. తాజాగా నయనతారకు ఇలాంటి అనుభవమే ఎదురైంది. తనకు ఆసక్తిగా అనిపించిన పలు విషయాలను సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకుంటున్నారు. ఈ క్రమంలో ఆమె మందార పువ్వులతో చేసిన టీ అంటే తనకు ఎంతో ఇష్టమని ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో తెలిపారు. దీనివల్ల రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు పలు దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం దొరుకుతుందని నయనతార పేర్కొన్నారు. ఫాలోవర్స్‌ను నయనతార తప్పుదోవ పట్టిస్తున్నారని, ఆమె చెప్పినదాంట్లో నిజం లేదని కొంతమంది వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆమె తన పోస్ట్‌ను తొలగించారు. 'మూర్ఖులతో వాదనకు దిగొద్దు. మీరు గెలవలేరు. మిమ్మల్ని కూడా వారి స్థాయికి దిగజార్చి ఓడిస్తారు' అనే మార్క్ ట్వైన్ సూక్తిని షేర్ చేశారు. తనను విమర్శించిన వారిని ఉద్దేశించి ఆమె ఈ పోస్ట్ పెట్టారని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

పిల్లి మెడలో గంట కట్టేది ఎవరు?

తమిళ చిత్ర పరిశ్రమ సోమవారం సమావేశమై కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంది. వీటిల్లో ప్రధానమైంది, తెలుగు నిర్మాతలు సాహసించి తీసుకోలేనిది ఏమిటంటే .. ఇకపై హీరోలు, హీరోయిన్లకు ముందుగా అడ్వాన్సులు ఇవ్వకూడదన్నది. కొంతమంది నటీనటులు, టెక్నీషియన్లు నిర్మాతల నుంచి అడ్వాన్స్‌లు తీసుకుని సినిమాలకు డేట్స్ ఇవ్వకుండా ఆ తర్వాత ఒప్పుకొన్న చిత్రాలకు వర్క్ చేస్తున్నారు. ఇకపై అలా కాకుండా మొదట ఎవరివద్ద అడ్వాన్స్‌లు తీసుకున్నారో వారి షూటింగ్ పూర్తి చేసిన తర్వాతే కొత్త సినిమా షూటింగ్‌లో పాల్గొనాలి. తమిళంలో ఈ నిర్ణయాన్ని అమలు చేయగలరేమో కానీ తెలుగులో సాధ్యమయ్యే పనేనా అనే చర్చ తెలుగు చిత్ర పరిశ్రమలో మొదలైంది. ఎందుకంటే ప్రముఖ సంస్థలు పెద్ద హీరోలకు అడ్వాన్సులు ఇవ్వడం, వారు తీసుకోవడం సహజంగా జరిగేదే. ఇలా అడ్వాన్స్ ఇచ్చిన వెంటనే ఆ సినిమా మొదలవుతోందా అంటే చాలా సందర్భాల్లో లేదనే చెప్పాల్సి ఉంటుంది. కథ కుదరకో, కాంబినేషన్ సెట్ అవకో సినిమాలు ప్రారంభం కావడానికి లేట్ కావచ్చు. ఆ లేట్ అనేది నెలలు కావచ్చు, సంవత్సరాలు కావచ్చు. ఏళ్ల తరబడి వెయిట్ చేసినా చివరకు జరగని సందర్భాలు ఉన్నాయి కూడా. ఈ లోపు అన్నీ సెట్ అయిన వేరే సినిమా మొదలుపెట్టేస్తుంటారు హీరోలు. హీరోలకు ఇచ్చిన అడ్వాన్సులకు వడ్డీలు కడుతూ లోలోపల బాధ పడుతుంటారు తప్ప బయటకు వ్యక్తం వ్యక్తం చేయలేని పరిస్థితి. ఎందుకంటే ఎప్పటికైనా హీరోగారు కరుణించి డేట్స్ ఇవ్వవచ్చనే ఓ ఆశ వారిని సంవత్సరాల తరబడి వెయిట్ చేసేలా చేస్తుంటుంది. అలాగే ఒక సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, ఓ వారం రోజుల పాటు షూటింగ్ చేసో, లేక కొంత భాగం షూట్ చేసిన తర్వాత ఆ సినిమాను అలా పక్కన పెట్టేసి మరో కొత్త చిత్రం చేసే హీరోలు తెలుగు చిత్రపరిశ్రమలోనూ ఉన్నారు. ఇలాంటి విషయాలపై తెలుగు చిత్ర పరిశ్రమ కూడా కఠిన నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడిస్తుంటుంది కానీ అవి ఆచరణకు దూరంగానే ఉంటున్నాయి. ఇటువంటి నేపథ్యంలో తమిళ నిర్మాతలమండలి తీసుకున్న నిర్ణయాలు రేకెత్తిస్తున్నాయి. తెలుగులో కూడా ఇలాంటి కఠిన నిర్ణయాలు తీసుకుంటే బాగుంటుందని నిర్మాతల మనసులో ఉంది కానీ పిల్లి మెడలో గంట కట్టేది ఎవరు?




తమిళ నిర్మాతల మండలి నిర్ణయాలు ఇవే

అధ్యక్షుడు ఎస్.మురళి నేతృత్వంలో సభ్యులు సోమవారం వివిధ సంఘాలకు చెందిన నిర్వాహకులు, ప్రతినిధులతో కీలక సమావేశం నిర్వహించారు. ఇందులో పలు తీర్మానాలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. అవేమిటో ఇప్పుడు చూద్దాం.

- ఆగస్టు 16 తర్వాత కొత్త సినిమాల షూటింగ్ మొదలు పెట్టకూడదు. ప్రస్తుతం చిత్రీకరణలో ఉన్న సినిమాలన్నీ అక్టోబరు 31 లోపు పూర్తి చేయాలని ఆయా చిత్ర బృందాలకు సూచించింది.
- పెండింగ్‌లో ఉన్న చిత్రాలు, ఇచ్చిన అడ్వాన్స్‌లపై నివేదిక అడిగిన నిర్మాతల మండలి.
- నవంబరు ఒకటినుంచి ఎలాంటి సినిమాల చిత్రీకరణ చేపట్టకూడదు.
- ఇప్పటికే చిత్రీకరణ పూర్తయి విడుదలకు నోచుకోని చిత్రాల పరిస్థితి ఒక కొలిక్కి వచ్చేంత వరకు ఆగస్టు 16 నుంచి కొత్త సినిమాలేవీ చిత్రీకరణ మొదలుపెట్టకూడదు.
- నటీనటులు, సాంకేతిక నిపుణులు జీతభత్యాలు పెంచుకుంటూ పోతున్నారని, ఖర్చులకు ఒక విధానమంటూ లేకపోయిందని, ఈ అంశాలపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిర్మాతలమండలి అభిప్రాయపడింది. వీటిని క్రమబద్ధీకరించడంతో పాటు సరైన ప్రణాళికతో ముందుకుసాగాలని, అందువల్ల నవంబరు ఒకటో తేదీ నుంచి ఏ ఒక్క సినిమా షూటింగ్ జరగరాదని తీర్మానించింది.
- అగ్రనటులు నటించే కొత్త చిత్రాలను ఎనిమిది వారాల తర్వాతే ఓటీటీలకు ఇవ్వాలని తీర్మానించింది.

-ఆంధ్రజ్యోతి, చెన్నై



ధనుష్ పై ఆగ్రహం

హీరో ధనుష్‌పై తమిళ నిర్మాతల మండలి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈయన ఆరు చిత్ర నిర్మాణ సంస్థల నుంచి అడ్వాన్స్‌లు తీసుకున్నారని, ఇలా అడ్వాన్సులు చెల్లించిన మిగిలిన నిర్మాతలు కూడా అసోసియేషన్‌తో మాట్లాడి తమ పనులు మొదలు పెట్టాలని సూచన చేసింది. ఇకపై నిర్మాతల మండలి అనుమతి ఉంటేనే ధనుష్ చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ లభిస్తుంది. అయితే ధనుష్ ఇప్పుడు తెలుగులో రెండు చిత్రాల్లో నటిస్తున్నారు కనుక ఈ నిర్ణయాల ప్రభావం ఆయన మీద అంతగా ఉండక పోవచ్చు.

కొత్తగా..



ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న 'రాజా సాబ్' చిత్రం నుంచి సోమవారం అప్డేట్ వచ్చింది. ప్యాన్ ఇండియా గ్లింప్స్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ప్రభాస్ వింటేజ్ లుక్‌లో చార్మింగ్‌గా కనిపించారు. రొమాంటిక్ హారర్ జానర్‌లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇప్పటికే 40 శాతం చిత్రీకరణ పూర్తయింది. ఆగస్టు 2 నుంచి మరో భారీ షెడ్యూల్ ప్రారంభించనున్నారు.

చిత్రం: రాజాసాబ్
ప్రొడ్యూసర్: టీజీ విశ్వ ప్రసాద్
డైరెక్టర్: మారుతి
బ్యానర్: పీపుల్ మీడియా ఫ్యాక్టరీ
నటీనటులు: నిధి అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధి కుమార్, యోగిబాబు తదితరులు


ఆగస్టులో భవనమ్



కమర్షియల్ ఎలిమెంట్స్‌తో రూపొందిన హారర్ కామెడీ 'భవనమ్'. ఆగస్టు 9న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించింది. నటుడు సప్తగిరి మాట్లాడుతూ 'సూపర్ గుడ్ ఫిల్మ్స్ బేనర్‌లో ఓ సినిమా చేయాలనే కల 'భవనమ్'తో నెరవేరింది' అన్నారు. ఇందులో కామెడీ యాక్షన్ సాంగ్స్ ప్రేక్షకులను అలరిస్తాయని షకలకశంకర్ చెప్పారు. సినిమాను చాలా గ్రిప్పింగ్‌గా తెరకెక్కించాం, ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకుడు బాలాచారి తెలిపారు.

చిత్రం : భవనమ్
ప్రొడ్యూసర్ : ఆర్‌బీ చౌదరి, వాకాడ అంజన్ కుమార్, వీరేంద్ర సీర్వి
డైరెక్టర్ : బాలాచారి కూరెళ్ల
బ్యానర్ : సూపర్‌గుడ్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్
నటీనటులు : సప్తగిరి, ధన్‌రాజ్, షకలక శంకర్, తాగుబోతు రమేశ్, మాళవిక సతీషన్ తదితరులు

ఉషా పరిణయ గాథ



ఇంటిల్లిపాదిని ఆకట్టుకునే ప్రేమకథతో రూపొందిన చిత్రం 'ఉషా పరిణయం'. 'లవ్ ఈజ్ బ్యూటిఫుల్' అనేది ఉపశీర్షిక. ఆగస్టు 2న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరో సాయిదుర్గతేజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్త నటీనటీలతో రూపొందుతున్న ఇలాంటి మంచి చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తే, ఈ తరహా చిత్రాలు మరిన్ని వస్తాయి అని సాయిదుర్గతేజ్ అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మా కుటుంబం మద్దతుతో ఈ చిత్రాన్ని నిర్మించాను. ధ్రువన్ మంచి సంగీతం అందించాడు' అన్నారు. అందరి సహకారంతో ఓ మంచి సినిమాను అందిస్తున్నాం, సినిమా చూస్తున్నప్పుడు ఎంజాయ్ చేస్తారు అని హీరో చెప్పారు. ఈ సినిమాతో నటిగా నాకు మంచి పేరు వస్తుందని హీరోయిన్ చెప్పారు.

చిత్రం : ఉషా పరిణయం
ప్రొడ్యూసర్ : కె. విజయ్ భాస్కర్
డైరెక్టర్ : కె. విజయ్ భాస్కర్
బ్యానర్ : విజయ్ భాస్కర్ క్రాఫ్ట్ ప్రొడక్షన్
నటీనటులు : శ్రీ కమల్, తాన్వీ ఆకాంక్ష, సూర్య

బడ్డీ టికెట్ ధరల తగ్గింపు



అడ్వంచరస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'బడ్డీ'. ఆగస్టు 2న విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో బడ్డీ సినిమా రేట్లను తగ్గిస్తున్నట్లు మేకర్స్ సోమవారం ప్రకటించారు. సింగిల్ స్క్రీన్లలో రూ. 99, మల్టీప్లెక్స్‌లో రూ. 125గా టికెట్ ధరలు నిర్ణయించారు. భారతీయ వెండితెరపైన ఒక సరికొత్త ప్రయోగంగా 'బడ్డీ' సినిమా నిలుస్తుందని ఈ సందర్భంగా మేకర్స్ తెలిపారు.

చిత్రం : బడ్డీ
ప్రొడ్యూసర్ : కేఈ జ్ఞానవేల్ రాజా, అధన్ జ్ఞానవేల్ రాజా
డైరెక్టర్ : శామ్ ఆంటోన్
బ్యానర్ : స్టూడియో గ్రీన్ ఫిలింస్
కాస్టింగ్ : అల్లు శిరీష్, గాయత్రి భరద్వాజ్, అజ్మల్ అమీర్, అలీ, ముఖేశ్ కుమార్ తదితరులు

సీనియర్ సినీ నిర్మాత సూర్యనారాయణబాబు కన్నుమూత



సీనియర్ నిర్మాత, మహేశ్‌బాబు మేనమామ ఉప్పలపాటి సూర్యనారాయణ బాబు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో కన్నుమూశారు. సూపర్‌స్టార్ కృష్ణకు బావ అయిన సూర్యనారాయణ బాబు 'మనుషులు చేసిన దొంగలు', రామ్ రాబర్ట్ రహీమ్', 'సంధ్య', 'బెజవాడ రౌడీ' తదితర చిత్రాలు నిర్మించారు. రాజకీయాల్లోకి ప్రవేశించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గుడివాడ నియోజక వర్గం నుంచి ఎన్టీఆర్ పై పోటీ చేసి ఓడిపోయారు. నటుడు విజయ్‌చందర్‌తో కలిసి ఎన్టీఆర్‌కు వ్యతిరేకంగా 'కలియుగ విశ్వామిత్ర' చిత్రాన్ని కూడా నిర్మించారు. సూర్యనారాయణ బాబు పార్థివ దేహాన్ని మంగళవారం ఉదయం కోకాపేటలోని మూవీ టవర్స్‌లో ఉంచి, ఆ తర్వాత మహా ప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు చెప్పారు.



తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ తమ సభ్యులకు హెల్త్ ఇన్సూరెన్స్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని దర్శక సంజీవని పేరుతో ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హీరో విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, ఉపాధ్యక్షుడు సాయి రాజేశ్, నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌పీసీఏ సమావేశాన్ని నిర్వహిస్తున్న జిల్లా జడ్జి పార్థసారధి

ఆవులను రోడ్లపై వదలకుండా చూడాలి

● జిల్లా జడ్జి వైవీఎస్‌బీజీ పార్థసారధి

గుంటూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఆవులను వాటి యజమానులు రోడ్లపై వదలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా జడ్జి వైవీఎస్‌బీజీ పార్థసారధి మునిసిపల్, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. సమాజంలో జంతువులపై క్రూరత్వ నివారణ(ఎస్.పి.సి.ఏ) చర్యలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సోమవారం జిల్లా కోర్టు ఆవరణలోని తన కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపైన ఆవులు తిరగడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై ప్రజల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. రోడ్లపై ఆవులు తిరగకుండా ఏవిధమైన చర్యలు చేపడుతున్నారని మున్సిపల్ అధికారులను ఆయన ప్రశ్నించారు. ఆవులను వెంగళాయపాలెంలోని గోశాలకు తరలిస్తున్నామని, వాటి యజమానులు వచ్చినప్పుడు రిజిస్టర్‌లో ఫొటోతో కూడిన వివరాలు నమోదు చేసుకొని ఆవులను వారికి స్వాధీనం చేస్తున్నామన్నారు. అలాగే ఆవులకు ఆరోగ్య సమస్యలు వచ్చినపుడు పశువైద్యులచే చికిత్స అందిస్తున్నామన్నారు. ఆవుల అక్రమ రవాణా జరగకుండా రవాణా శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని, అక్రమరవాణాలో దొరికిన ఆవులను గోశాలకు తరలించాలన్నారు.

సొసైటి ఫర్ ది ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ టు యానిమాల్స్ (ఎస్.పి.సి.ఏ) కమిటీ సభ్యులు వాట్సప్ గ్రూప్ ఏర్పాటుచేసుకొని పశువుల అక్రమ రవాణా, రోడ్లపై పశువులు సంచరించినా, మరేమైనా సంఘటనలు జరిగినా ఆ సమాచారాన్ని గ్రూప్ ద్వారా తెలియజేసుకోవాలన్నారు. మున్సిపల్ అధికారులు కుక్కలను పట్టుకొస్తే వాటికి యాంటీరాబిస్ ఇంజెక్షన్ ఇచ్చి, సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేసి విడిచిపెడతామని జిల్లా పశుసంవర్థక శాఖాధికారి ప్రధాన న్యాయమూర్తికి తెలిపారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సెక్రెటరీ లీలావతి, జిల్లా పశుసంవర్థకశాఖ ఏడీ డాక్టర్ మోహన్‌రావు, గుంటూరు తూర్పు మండల తహసీల్దార్ రిజ్వాన్, ఎంవీఐ కే మల్లేశ్వరి, సౌజన్య, అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.అమృతరాణి, పొన్నూరు మున్సిపాలిటీ మేనేజర్ టి.వెంకటరావు, జీఎంసీ బయాలజిస్టు ఎన్ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూలై 29: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత ప్రజలు అందరూ సుభిక్షంగా ఉన్నారని, ప్రజల శ్రేయస్సే ప్రధాన లక్ష్యంగా పాలన సాగుతోందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు లేనిపోని విమర్శలు చేస్తున్నారని, గత ఐదేళ్ల పాలనలో అవినీతి తప్ప అభివృద్ధి లేదన్నారు. గతంలో గ్రామాల్లో వైసీపీ నేతలు మద్యం, గంజాయి అమ్మకాలే వ్యాపారంగా పెట్టుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కూడా పూర్తికాలేదని, అప్పుడే పథకాలు అమలుచేయడం లేదని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. హామీ ఇచ్చిన ప్రతి పథకం అమలుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ పథకాలకు మొత్తం జగన్‌రెడ్డి పేర్లు మాత్రమే పెట్టుకున్నారని, ఎన్‌డీఏ ప్రభుత్వంలో మహోన్నత వ్యక్తుల పేర్లు పెట్టి వారిని గౌరవంగా చూస్తున్నామన్నారు.

టిడ్కో ఇళ్లను నాశనం చేసిన వైసీపీ ప్రభుత్వం

● వచ్చే మూడు నెలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం
● ప్రజల పన్నుల ఆదాయం కూడా వైసీపీ ప్రభుత్వం వాడేసింది
● మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ

తుళ్లూరు, జూలై 29: వైసీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లను పూర్తిగా నాశనం చేసిందని మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగునూరు నారాయణ అన్నారు. సోమవారం రాజధాని అమరావతిలో మంత్రి నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్ పరిశీలించారు. ముందుగా మందడం సీడ్ యాక్సెస్ పక్కన కట్టిన టిడ్కో గృహాలను సందర్శించారు. అనంతరం దొండపాడులో టిడ్కో ఇళ్లను పరిశీలించారు. మౌలిక వసతుల కల్పనపై లబ్ధిదారులతో మంత్రి నారాయణ మాట్లాడారు. ఇళ్లకు వచ్చే రోడ్లు సరిలేవని, నీటి సమస్య ఉందని మంత్రికి వివరించారు. ఒక్క రూపాయితో ఇళ్లు ఇస్తామని చెప్పిన జగన్‌రెడ్డి మోసం చేశాడని, రుణభారం తగ్గించాలని లబ్దిదారులు వేడుకున్నారు. గృహ సముదాయాలను, పరిసరాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా దొండపాడులో మీడియా సమావేశంలో మంత్రి నారాయణ మాట్లాడారు. ప్రతి మహిళ తన కుటుంబంతో ఆనందంగా గడిపేలా టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. వచ్చే మూడు నెలల్లో టిడ్కో ఇళ్లకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రాజధాని రైతులకు త్వరలోనే కౌలుడబ్బులు విడుదల చేస్తామని చెప్పారు. టిడ్కో ఇళ్ల లబ్దిదారులను బ్యాంకులు ఇబ్బంది పెట్టకుండా గడువు పెంచాలని కోరతామన్నారు. రైతుల ప్లాట్లకు లోన్ ఇచ్చేలా బ్యాంకర్స్‌తో మాట్లాడమని చెప్పారు. రాజధాని పనులు వేగవంతం అవుతాయని మంత్రి స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లకు నాసిరకం రంగులు వేసిందని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. అంతర్గత రోడ్లు కూడా నాణ్యత లేవన్నారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు ఎర్రగోపు నాగరాజు, తాడికొండ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, రాష్ట్ర యువత ఉపాధ్యక్షుడు పుట్టి రామచంద్రరావు, తెలుగు రైతు ఉపాధ్యక్షుడు నూతలపాటి రామారావు, మూడు పార్టీల నాయకులు పాల్గొన్నారు.





టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

విజయసాయిరెడ్డి ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూలై 29: మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హెచ్చరించారు. వినుకొండ సింగర చెరువు సందర్శనలో భాగంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయసాయిరెడ్డి నోరు తెరిస్తే అన్నీ అసత్యాలు, అబద్ధాలు, గోబెల్ ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు. విజయసాయిరెడ్డి ట్విట్టర్లో టీడీపీపై చేస్తున్న విమర్శలు మానుకోవాలన్నారు. కులాల సంప్రదాయం తెచ్చింది జగన్‌రెడ్డేనన్నారు. నామినేటెడ్ పదవులన్నీ వైవీ సుబ్బారెడ్డి, కరుణాకరెడ్డి, ధర్మారెడ్డి, జవహర్‌రెడ్డి ఇలా ఒకే సామాజిక వర్గానికే ఇచ్చింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు, మిగిలిన సామాజికవర్గాలకు మీరు ద్రోహం చేశారని, అందుకే అన్ని వర్గాల ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. ఎంపీ విజయసాయిరెడ్డిని ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించినా సిగ్గు రాలేదన్నారు. వివిధ కీలక పదవుల్లో, నామినేటెడ్ పదవుల్లో సీఎం చంద్రబాబునాయుడు అన్ని వర్గాలకు న్యాయం చేస్తుంటే విజయసాయిరెడ్డి, జగన్‌రెడ్డి ఓర్వలేక అసత్య ప్రచారాలు చెయ్యడం సిగ్గుచేటన్నారు.

పథకాలకు మహనీయుల పేర్లపై హర్షం

ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు మంత్రి నారా లోకేశ్ మహనీయులు పేర్లు నామకరణం చెయ్యడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ, లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల సంక్షేమానికి అందచేస్తున్న పథకానికి సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్రగా, మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ, విద్యార్థులకు ప్రతిభా పురస్కారం పథకానికి ఏపీజే అబ్దుల్ కలాం... ఇలా ప్రభుత్వ పథకాలకు మహనీయుల పేర్లు పెట్టడం కూటమి ప్రభుత్వం గొప్పతనం అన్నారు. ఒక్కసారి ప్రజలు అవకాశం ఇస్తే జగన్‌రెడ్డి, అన్ని సంక్షేమ పథకాలకు తన పేర్లు పెట్టుకుని లక్షల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. 1వ తేదీన లబ్ధిదారులు ఇంటి వద్ద ఉండి పింఛన్ తీసుకోవాలని వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు జీవీ సూచించారు. సచివాలయ ఉద్యోగులు ఇంటివద్దకే వచ్చి పింఛన్ ఇస్తారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు.

శీతల గిడ్డంగుల్లో రంగు మారుతున్న మిర్చి

● ఏడాది క్రితం నిల్వ చేసిన టిక్కీలలోకి ఫంగస్ కూడా చేరిక
● తాలుకాయల కింద అమ్ముకోవాల్సిన దుస్థితి

గుంటూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మిర్చి మార్కెట్‌లో ధర పతనమైన కారణంగా గత ఏడాది శీతల గిడ్డంగుల్లో నిల్వచేసిన ఎండు మిరపకాయలు రంగు మారిపోతున్నాయి. ధర పెరిగే పరిస్థితి లేకపోవడంతో వచ్చిందే దక్కుదల అని భావిస్తూ రైతులు, వ్యాపారులు కోల్డ్‌స్టోరేజ్‌ల నుంచి టిక్కీలు బయటకు తీస్తుంటే వాటిల్లోని మిర్చి నలుపు రంగులోకి మారిపోయి ఉంటోంది. నెలల తరబడి ఒకే లాట్‌లో ఉండటం వలన ఫంగస్ కూడా చేరుతున్నది. దీంతో వాటిని మార్కెట్‌యార్డులో విక్రయించేందుకు తీసుకొస్తే క్వింటాల్‌కు కనీసం రూ.8వేలు కూడా ధర రావడం లేదు. దీంతో మిర్చి స్టాకిస్టులు బావురుమంటున్నారు. ఇందుకు కారణం కోల్డ్‌స్టోరేజ్‌లలో మిర్చి నిల్వ చేసినప్పుడు క్వింటాల్ ధర రూ.18 వేల నుంచి రూ.20వేల మధ్యన ఉండటం. ఇప్పుడు ధర సగానికి సగం తగ్గిపోవడమే కాకుండా అదనంగా కోల్డ్‌స్టోరేజ్ చార్జీలు చెల్లించాల్సి వస్తుండటంతో తీవ్రంగా నష్టాలను చవి చూస్తున్నారు.

2023 మార్చి నుంచి మే నెలల మధ్యన మిర్చి ధర మార్కెట్‌లో తగ్గింది. అంతకుముందు వరకు క్వింటాల్ ఒక దశలో రూ.27వేల వరకు వెళ్లింది. అయితే ఉన్నపళంగా క్వింటాల్‌కి రూ.7వేలకు పైగా ధర తగ్గడంతో అప్పట్లో రైతులు, వ్యాపారస్థులు కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేశారు. గత ఏడాది నవంబరు, డిసెంబరు నెలల వరకు వేచిచూసినా ధర పెరగలేదు. మరోవైపు కొత్త సరుకు రావడం ప్రారంభమైంది. అప్పట్లో దాదాపుగా 35 లక్షల టిక్కీల వరకు స్టోరేజ్‌లలో నిల్వ చేయగా గత సంవత్సరం డిసెంబరు నెల వరకు 15 లక్షల టిక్కీలను ధర తక్కువ అయినా రైతులు విక్రయించేశారు. మరో 20 లక్షలు మాత్రం అలానే స్టోరేజ్‌లలో నిల్వ ఉండిపోయాయి. ఈ ఏడాది(2024) మే నెల వరకు మరో 50 లక్షల టిక్కీలను రైతులు నిల్వ చేశారు. దీంతో ప్రస్తుతం 70 లక్షల టిక్కీలు గిడ్డంగుల్లో ఉన్నట్లు మార్కెట్ కమిటీ అధికారులు వివరాలు సేకరించారు.

కాగా గత ఏడాది నిల్వచేసిన వాటిని ఇప్పుడు ఎంత ధర వస్తే అంతకు విక్రయించేందుకు రైతులు సిద్ధపడుతున్నారు. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధర కూడా వాటికి లభించడం లేదు. ఇందుకు కారణం నాణ్యత లోపించడమే. మిర్చి ఎప్పుడైనా ఎర్రరంగులో ఉంటేనే ఎగుమతిదారులు కొనుగోలు చేస్తారు. అయితే స్టోరేజ్‌లలో గత ఏడాది నిల్వ చేసినవి నలుపు రంగు తిరిగింది. సహజంగా స్టోరేజ్‌లలో లాట్‌లలోని టిక్కీలను తిరగేస్తుండాలి. అయితే ఎలా పెట్టినవి అలానే కదిలించకుండా ఉంచడంతో చాలా టిక్కీల్లోకి ఫంగస్ చేరిపోయింది. దీంతో వాటిని కొనుగోలు చేయడానికి ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ఒక విధంగా తాలుకాయల కింద లెక్కకట్టి వాటిని క్వింటాల్ రూ.8వేలకు కొంతమంది కొనుగోలు చేస్తున్నారు. దీనివలన క్వింటాల్‌కి ఒక్కో రైతు రూ.10 వేలకు పైగానే నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా రాబోయే మూడు నెలల్లో ప్రస్తుతం కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ ఉన్న 70 లక్షల టిక్కీల్లో సింహభాగం విక్రయం జరగకపోతే నవంబరు నెల నుంచి కొత్త పంట వస్తుంది. అప్పుడు రైతులు మరింతగా నష్టపోయే ప్రమాదం ఉంటుంది. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ అధికారులు రైతుల పక్షాన నిలిచి తరచుగా ఎక్స్‌పోర్టర్లతో సమావేశాలు నిర్వహించి కొనుగోళ్లు పెరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

టీడీపీలో చేరిన పలువురు వైసీపీ కౌన్సిలర్లు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, జూలై 29: పలువురు మున్సిపల్ వైసీపీ కౌన్సిలర్లు, కౌన్సిలర్ల కుటుంబసభ్యులు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. వీరు సోమవారం గుంటూరులో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పార్టీ కండువాను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో 8వ వార్డు కౌన్సిలర్ గెల్లిపోగు జగన్‌మోహన్‌రెడ్డి, 9వ వార్డు జగన్నాథం శివయ్యతోపాటు పదో వార్డు కౌన్సిలర్ సిద్ధమ్మ భర్త సిద్ధయ్య, రెండో వార్డు కౌన్సిలర్ షేక్ జానీబీ భర్త నాగుల్‌మీరా, ఐదో వార్డు కౌన్సిలర్ కలివెల జ్యోతి భర్త కిషోర్, ఏడో వార్డు రామగాని రమణి భర్త శంకర్, 11వ వార్డు కౌన్సిలర్ బుట్టి శ్యామలజ్యోతి భర్త చంద్ర, 24వ వార్డు తాళ్ల గోవర్ధని మామ కొండలు ఉన్నారు.

పాటిబండ్ల కొండపై శాసనం



పాటిబండ్ల మల్లేశ్వరస్వామి కొండపై శాసనం

పెదకూరపాడు, జూలై 29: మండలంలోని పాటిబండ్ల కొండపై ఉన్న మల్లేశ్వర స్వామి ఆలయ ప్రవేశద్వారం పక్కన కొత్త శాసనం ఉందని, పురావస్తు ఔత్సాహిక పరిశోధకులు పాములపాటి శ్రీనాథ్‌రెడ్డి, మనిమేల శివశంకర్‌లు మంగళవారం తెలిపారు. కారుణ్య ఆశ్రమ నిర్వాహకులు డాక్టర్ అల్లం ఇన్నారెడ్డి గ్రామ చరిత్ర పై పుస్తకరచనలో భాగంగా సమాచారం కోసం వారితో కలసి పురాతన ఆలయాలు, కట్టడాలను పరిశీలించినట్టు తెలిపారు. కొండపై ఉన్న శాసనం 17-18వ శతాబ్దం నాటిదని, ఈ శాసనంలో గోపాపాత్రుడి కుమారుడైన కొండముడు అనే వ్యక్తి గుర్రాన్ని కొండ పడమటి దిక్కుగా ఎక్కించి తూర్పు దిక్కుగా వెళ్ళేవారని శాసనంలో ఉందని తెలిపారు. క్రీస్తు పూర్వం 2000 సంవత్సరం కొత్త రాతియుగం నాటి రాతి పనిముట్లు, 14 శతాబ్దం నాటి మహిషాసుర మర్దని విగ్రహం, 16వ శతాబ్దం నాటి ఆంజనేయ విగ్రహాన్ని గుర్తించినట్టు వివరించారు. పురాతన ఆనవాళ్ళను భద్రపరిచి భావితరాలకు అందించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ ఆచంట రాము తదితరులు ఉన్నారు.

గిరిజన వ్యక్తిని అదుపులోకి తీసుకోవడంతో ఉద్రిక్తత

● ఘర్షణలో గాయపడ్డ రేంజర్ సత్యనారాయణరెడ్డి
● ఫారెస్ట్ అధికారుల దాడిలో గాయపడ్డ గిరిజన మహిళ

వెల్దుర్తి, జూలై 29: మండలంలోని హనుమాపురంతండాకు చెందిన ఓ గిరిజన వ్యక్తిని ఫారెస్ట్ అధికారులు అదుపులోకి తీసుకోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ సంఘటనలో ఫారెస్ట్ రేంజర్‌తోపాటు ఓ గిరిజన మహిళకు గాయాలయ్యాయి. అధికారులు జరిపిన లాఠీచార్జిలో పలువురు గిరిజనులు గాయాలపాలయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని హనుమాపురంతండాకు చెందిన గోవిందునాయక్ అటవీ ఉత్పత్తులతోపాటు జంతువులను అక్రమ రవాణా చేస్తున్నట్లు భావించి ఫారెస్ట్ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం హనుమాపురంతండాకు చేరుకున్న అధికారులు గోవిందునాయక్ ఇంటితోపాటు మరికొన్ని ఇళ్లలో సోదాలు జరిపారు. గోవిందునాయక్ ఇంట్లో రూ. 5 లక్షల మేర నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అటవీ ఉత్పత్తుల అక్రమ రవాణా చేసి ఈ నగదు అందుకున్నట్లు ఫారెస్ట్ అధికారులు భావిస్తున్నారు. కాగా ఆ సమయంలో గోవిందునాయక్ ఇంట్లో లేడు. సోమవారం గోవిందునాయక్‌ను మండలంలోని గొట్టిపాళ్లలో ఫారెస్ట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడ ఉన్న కొందరు గిరిజనులు ఎందుకు అరెస్ట్ చేస్తున్నారో చెప్పాలంటూ భీష్మించారు. దీంతో ఫారెస్ట్ అధికారులు లాఠీచార్జి చేయడంతోపాటు మహిళలపై దాడులకు తెగబడ్డారని బాధితులు వాపోయారు. ఈ సంఘటనలో కేతావత్ విజయబాయికి గాయాలు కావడంతో మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విజయబాయి పొట్టపై తన్నడంతోనే గాయమైనట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న మరికొంతమంది గిరిజనులు గంగలకుంట వద్ద అధికారుల వాహనాన్ని అడ్డగించడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. అటవీ అధికారులు మరోమారు లాఠీచార్జికి దిగారు. ఆగ్రహించిన గిరిజనులు ఫారెస్ట్ అధికారుల వాహనంపై రాయి విసరడంతో వాహనం అద్దం పగిలి వాహనంలో ఉన్న రేంజర్ సత్యనారాయణరెడ్డి చేతికి గాయమైంది. కాగా ఈ సంఘటనలపై ఫారెస్ట్ అధికారులు వివరాలు వెల్లడించడం లేదు. గోవిందునాయక్‌తోపాటు మరో నలుగురిని అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.



గిరిజనులపై లాఠీచార్జి చేస్తున్న ఫారెస్ట్ అధికారులు



గాయాలపాలైన రేంజర్ సత్యనారాయణరెడ్డి



మాచర్ల ప్రభుత్వ వైద్యశాలలో విజయబాయి

కాంట్రాక్ట్ నాన్ టీచింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

పెదకాకాని, జూలై 29: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కాంట్రాక్ట్ విధానంలో నాన్ టీచింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్నవారు నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏర్పాటుచేశారు. ఈ కార్య వర్గానికి అధ్యక్షుడిగా కంకణాల వెంకట సుధీర్, కార్యదర్శిగా డాక్టర్ దొడ్డక శివరామకృష్ణ, కోశాధి కారిగా లంకపల్లి సాంబశివరావు, ఉపాధ్యక్షులుగా టి.సుబ్రమణ్యం, సయ్యద్ అనీషాబేగం, జాయింట్ సెక్రటరీస్‌గా ఎం.శిరీష, జి.రజత, ఎల్.సౌమ్య, కార్యవర్గసభ్యులుగా యు.అన్నామని, జి.శాంతరాజు, ఏ మణి, కే కిషోర్, ఎం.అన్నపూర్ణాదేవి ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ప్రకటించారు. ఈ కార్యవర్గానికి గౌరవ అధ్యక్షులుగా వికాస అధ్యక్షుడు టి.అనిల్ కుమార్, గౌరవకార్యదర్శిగా వికాసకార్యదర్శి కావూరి శ్రీనివాసరావు, సలహాదారులుగా కనకరాజు, అజయ్‌బాబులను ఎన్నుకొన్నట్లు నూతన అధ్యక్షుడు వెంకట సుధీర్ తెలిపారు.

ఇంజనీరింగ్ కళాశాల పేరు మార్చాలి

● టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

పెదకాకాని, జూలై 29: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల పేర్లు గత ప్రభుత్వం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీగా ఏకపక్షంగా మార్చింది. ఆ పేరు తొలగించాలని టీఎన్ఎస్ఎఫ్ నాయకులు సోమవారం డిమాండ్ చేశారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్కిటెక్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, సీఎం చంద్రబాబునాయుడుని దుర్భాషలాడారని, ప్రభుత్వం మారినా తన తీరు మార్చుకోకుండా ఇప్పటికీ వైసీపీ కార్యకర్తలా పనిచేస్తున్నారని తెలిపారు. ఇంజనీరింగ్ కళాశాల సిద్దయ్యది కూడా అదే తీరని, వీరిద్దరినీ వర్సిటీ నుండి తీసివేయాలని డిమాండ్ చేశారు. దానికి వైస్ చాన్సలర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు బత్తుల హేమంత్, రాష్ట్ర నాయకులు కొర్రపాటి అభిషేక్, ప్రధాన కార్యదర్శి హరీష్, ఉపాధ్యక్షులు శిరీష్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల పోరాటానికి మద్దతు

● ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ● రైతు సాధికార సంస్థ రాష్ట్ర కార్యాలయం ఎదుట ఉద్యోగుల ధర్నా

గుంటూరు(తూర్పు), జూలై 29: ప్రకృతి వ్యవసాయ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులు గత 16 నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వారి జీతాల చెల్లింపునకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రైతు సాధికారిక సంస్థ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గుంటూరు, గోరంట్ల వద్ద ఉన్న రైతు సాధికార సంస్థ రాష్ట్ర కార్యాలయం ఎదుట ఉద్యోగులు భారీనిరసన చేపట్టారు. ధర్నాకు మద్దతు తెలిపిన కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్లో ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ దేశవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పిన హామీ ప్రకారం ఉద్యోగులకు కూడా బడ్జెట్ కేటాయించాలన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి పీడీఎఫ్ ఎమ్మెల్సీల ఫోరం తరఫున మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. రైతు సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వై రాధాకృష్ణమూర్తి, కె.హరిబాబు మాట్లాడుతూ పథకాన్ని సమర్థవంతం గా నిర్వహించడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఉద్యోగుల జీతభత్యాలు చెల్లింపులో ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోకపోవడం సరైందికాదన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఆర్వీ నరసింహారావు మాట్లాడు తూ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించేందుకు కూడా ప్రభుత్వాలు సహకరించకపోవడం అన్యాయమన్నారు. ధర్నా అనంతరం రైతు సాధికారసంస్థ సీఈవో రామారావుకు వినతిపత్రం అందజేశారు. నాలుగైదు నెలల జీతాలు ఆగస్టు నెలలో చెల్లిస్తామని మిగిలిన బకాయి మొత్తాన్ని అక్టోబరు నాటికి పూర్తిగా చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని సీఈవో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్, వరప్రసాదు, సీఐటీయూ నాయకులు వై.నేతాజీ, వైరగాని శ్రీనివాస్, ఐ.వెంకటేశ్వర్లు, పాండురంగారావు, ప్రసాద్ పాల్గొన్నారు.



రైతు సాధికార సంస్థ సీఈవో రామారావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

36,353 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 40,891 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 36,353 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 15,748 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8500	16000	334	10800	14000
నెంబరు. 5	9500	12000	నెంబరు. 5	9500	10500
273	10000	11300	273	--	--
341	8500	14500	341	10000	15000
4884	15500	16000	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18500	తేజ	9000	18400
బ్యాడిగి	8500	15000	బ్యాడిగి	9000	15500
దేవనూరుడీలక్స్	8500	12800	దేవనూరుడీలక్స్	10000	11000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	11500

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



డీఈవో వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న బయ్యవరం హైస్కూల్ ఉపాధ్యాయులు

మాదక ద్రవ్యాలను దరి చేరనీయకండి

- విద్యార్థులను అన్నివిధాలా గమనిస్తూ ఉండాలి
- ఉపాధ్యాయులతో డీఈవో వెంకటేశ్వర్లు

క్రోసూరు,జూలై 29: విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని, వారిని అన్నివిధాలా గమనించాలని ఉండాలని పల్నాడు డీఈవో వెంకటేశ్వర్లు సూచించారు. వారం రోజులుగా పాఠశాలల్లో జరుగుతున్న 'శిక్షా సప్తాహ్' కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలం లోని బయ్యవరం జడ్పీ హైస్కూల్లో నిర్వహించిన 'సుభ్‌దిన్ భోజన్' కార్యక్ర మాన్ని డీఈవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందంతో ఆయన మాట్లాడుతూ..విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణను నేర్పాలని, చెడు వ్యసనాల బారిన పడకుండా తగిన అవగాహన కల్పించాలని ఉపాధ్యా యులకు సూచించారు. అలాగే ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా ప్రభుత్వం నిర్దేశించిన విధంగా రికార్డులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. 'శిక్షా సప్తాహ్' కార్యక్రమాన్ని ఐకమత్యంతో నిర్వహించాలని, అందరూ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. సోమవారం విద్యార్థు లకు పంపిణీ చేసిన పాయసం నాణ్యతను ఆయన రుచిచూసి పరిశీలించారు. ఈసంద ర్భంగా ఉపాధ్యాయులు డీఈవోను ఘనంగా సత్కరించారు. కార్య క్రమంలో హెచ్‌ఎం ఎం.సాంబశివరావు, ఉపాధ్యాయులు గంగా జ్యోతి, సరిత, శ్రీలక్ష్మి, ఆరోగ్యమ్మ, కవిత, వీరాంజనేయులు పాల్గొన్నారు.

సర్పంచ్‌గా వీర్ల వెంకమ్మ బాధ్యతల స్వీకరణ

దాచేపల్లి, జూలై 29: రామాపురం గ్రామ సర్పంచ్‌గా వీర్ల వెంకమ్మ సోమ వారం గ్రామ సచివాలయంలో గ్రామస్థుల సమక్షంలో బాధ్యతలు స్వీక రించారు. ఈ సందర్భంగా వీర్ల అంకమ్మ, ఆమె కుమారుడు వీర్ల రామకో టేశ్వరరావులు మాట్లాడుతూ గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సహాయ సహకారాలతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. ప్రధానంగా తాగునీరు, వీధిదీపాల సమస్య గ్రామంలో వుందన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పిడుగురాళ్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వేముల వినోద్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. వైసీపీ నేతలు పొలాల సాగునీటి పైపులు అమ్ముకొని జేబులు నింపుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్యక్రమంలో వేముల వీరరాఘవరెడ్డి, ఆకూరి వెంకటరెడ్డి, అచ్చిరెడ్డి, ఆకూరి వీరశేఖరరెడ్డి, గుర్రం నరసింహారావు, గుర్రం శ్రీనివాసరావు, నేలపాటి నాగేశ్వర రావు, చాట్ల యాకోబు, మట్ట కాశయ్య, ఊట్ల వెంకటేశ్వర్లు, లింగాల నరసిం హారావు, వీర్ల పుల్లయ్య, కసిరెడ్డి నాగిరెడ్డి, కసిరెడ్డి శౌరిరెడ్డి, మల్లాడి కృష్ణ పాల్గొన్నారు.

రైళ్లల్లో చోరీ నిందితులు అరెస్టు

దాచేపల్లి, జూలై 29: రైళ్లలో డోర్ వద్ద కూర్చొని సెల్‌ఫోన్ చూస్తున్న వ్యక్తుల నుంచి సెల్‌ఫోన్‌లు తస్కరించే దొంగలను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం నడికూడి రైల్వేస్టేషన్‌లో రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసరావునాయక్ నిందితుల వివరాలు వెల్లడించారు. రాజుపాలెం మండలం చౌటపాపాయ పాలెం గ్రామానికి చెందిన కుంటెళ్ల మణికంఠరాజు అనే నిందితుడు రైళ్లలో దొంగతనం చేసిన ఐదు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మాచర్ల- గుంటూరు రైలులో ప్రయాణం చేసే సమయంలో డోర్ ఫుట్‌పాత్ మీద కూర్చొని సెల్‌ఫోన్ చూస్తున్న వ్యక్తుల నుండి హఠాత్తుగా వచ్చి చేతిలోని ఫోన్‌లను లాక్కోవడం జరుగుతుందని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు వివరించారు.

పెదమక్కెనలో పారిశుధ్య చర్యలు

సత్తెనపల్లి రూరల్, జూలై 29 : మండలంలోని పెద మక్కెనలో గ్రామ సర్పంచ్ మందడపు అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య మెరుగుదలకు సోమవారం ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామంలోని ప్రతి వీధిలో మురుగు కాలువలను శుభ్రం చేశారు. కాలువల వెంట బ్లీచింగ్ చల్లారు. దోమల నిర్మూలనకు ఎబేట్ ద్రావణాన్ని కాలువల్లో పిచికారి చేశారు. కార్యక్రమంలో మందడపు సాంబశివరావు, ఏఎన్‌ఎం చింతపల్లి భాగ్యలక్ష్మి, పంచాయతీ సిబ్బంది ఆషా కార్యకర్తలు ఉన్నారు.

వర్షపునీటిని వృథా కానివ్వరాదు

దాచేపల్లి, జూలై 29: వర్షపునీటిని వృథా కానివ్వరాదని, నీటిని భూమిలోకి ఇంకిపోయే విధంగా చర్యలు చేపట్టాలని ఎంపిడిఓ వెంకటరమణ ప్రజలకు వివరించారు. సోమవారం దాచేపల్లిలో ఎంపిడిఓ వెంకటరమణతో పాటు ఉపాధిహామీ పథకం ఎపిఓ మల్లిఖార్జునరావు, ఎపిఎం మంత్రునాయక్‌లు దాచేపల్లిలో జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. నీరు చాలా విలువైనదని, దానిని వృదా చేయడంతో విలువైన సంపదను కోల్పోతామని తెలిపారు.

దాడి సంఘటనలో ఐదుగురిపై కేసు

దుర్గి, జూలై 29: మండల కేంద్రమైన దుర్గిలో ఆదివారం కారంపూడికి చెందిన ముగ్గురిపై జరిగిన దాడికి సంబంధించి ఐదుగురిపై దుర్గి పోలీస్‌స్టే షన్‌లో కేసు నమోదైంది. బాధితుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన కేశవ పట్నం నరసింహారావుతోపాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



పత్తి పొలాలను సందర్శిస్తున్న శాస్త్రవేత్తలు

పంట మార్పిడితో గులాభి పురుగు నివారణ

గురజాలటౌన్, జూలై 29: పత్తి సాగులో గులాభిరంగు పురుగు నివారణకు పంట మార్పిడి పద్ధతిని పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని మాడుగుల గ్రామ పరిధిలోని పత్తి పొలాలను ఏరువాక కేంద్రం, లాంఫామ్ గుంటూరు కోఆర్డినేటర్ నరేష్, సీని యర్ శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మిలు ఏవో సంధ్యారాణితో కలిసి సందర్శించారు. పత్తి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివ రించారు. పత్తి సాగుని జూలై, ఆగస్టు నెలల్లో నల్ల నేలల్లో చేపట్ట వచ్చని సూచించారు. సిఫార్సు చేసిన భాస్వరం ఎరువును ఆఖరి దుక్కిలో వేసి కలియ దున్నాలన్నారు. తుంగజాతి కలుపు నివారణకు వేసవి దుక్కులు వేయాల న్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులపై దాడి అమానుషం

- టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండలు

వెల్దుర్తి, జూలై 29: మండలంలోని రామచంద్రాపురంతండాలో గిరిజనులపై అటవీ శాఖాధికారులు లాఠీలతో దాడి చేయడం అమానుషమని, ఆ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల కొండలు సోమవారం ఒక ప్రటనలో పేర్కొన్నారు. గ్రామానికి చెందిన గోవిం దునాయక్‌ను ఎందుకు అదుపులోకి తీసుకున్నారని ప్రశ్నించిన గిరిజనులపై లాఠీలతో విరుచుకుపడడం అన్యాయమని అన్నారు. ఏదైనా తప్పు చేసుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలేగానీ, మహిళలని కూడా దూషించడం దుర్మార్గమన్నారు. అటవీశాఖాధికారుల దాడిలో గాయపడి ఓ మహిళ చికిత్స పొందుతుందన్నారు. ఈ అమానుష ఘటనపై బాధితులతో కలసి న్యాయ ప రంగా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నట్లు రావుల కొండలు తెలిపారు.

పీసపాడు మాజీ సర్పంచ్ దానయ్య మృతి

క్రోసూరు, జూలై 29 : మండలంలోని పీసపాడు మాజీ సర్పంచ్ గొర్రెపాటి దానయ్య(70) సోమవారం మరణించారు. ఆయన 1995 నుంచి 2000 సంవత్సరం వరకు పీసపాడు సర్పంచ్‌గా పనిచేసి గ్రామాభివృద్ధికి కృషి చేశారు. తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక నేతగా ఉన్న గొర్రెపాటి దానయ్య మృతికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తన ప్రగాఢ సాంతాపం వ్యక్తం చేస్తూ ఫోన్ ద్వారా దానయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. దానయ్య మృతి టీడీపీకి, వ్యక్తిగతంగా తనకు తీరని లోటని భాష్యం ప్రవీణ్ అన్నట్లు ఆ కుటుం బ సభ్యులు తెలిపారు. టీడీపీ నియోజక వర్గ నాయకులు కంచేటి సాయి బాబు, పార్టీ నేతలు మన్నెం శ్రీనివాసరావు, దుద్దుల యోహాన్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్‌లు కాండ్రు కాశయ్య, ఏపూరి నాగేశ్వరరావు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు నలజాల సదాశివరావు, కంచేటి నరసింహారావు తదితరులు దానయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాఠశాలల్లో 'సుభ్‌దిన్ భోజన్'

- విద్యార్థులకు అల్పాహారం, భోజనం అందజేత
- స్థానిక గ్రామస్థుల సహకారంతో కార్యక్రమం నిర్వహణ



రెంటపాళ్ళ హైస్కూల్లో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న డీఈవో

అచ్చంపేట, జూలై 29 : మండలంలోని తాడువాయి పంచాయతీ పరిధిలో గల సంద్ర తండాలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం నిర్వహించిన 'సుభ్‌దిన్ భోజన్' కార్యక్ర మాన్ని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్‌కే జానీ బాషా ప్రారంభించారు. సంద్ర తండాకు చెందిన బాణావత్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గ్రామస్థులు ఏర్పాటుచేసిన భోజనాన్ని పాఠశాలలోని 70 మంది విద్యార్థులకు అందజేశారు. 'సుభ్‌దిన్ భోజన్' కార్యక్రమంలో భాగంగా స్థానికుల పుట్టిన రోజులు, పెండ్లి రోజులు, అన్ని శుభకార్యాలలో పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయవచ్చునని ప్రధానోపాధ్యాయుడు ఆళ్ళమూడి వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుసుమ కుమారి, మాజీ ఎంపీపీ భూక్యా రజినీ కృష్ణా నాయక్, మాజీ సర్పంచ్ మూడావత్ బాలూ నాయక్, పల్లెలపాటి శ్రీనివాసరావు, లూకా నాయక్, వీఆర్‌వో, సచివాలయ సిబ్బంది, యూపీ స్కూల్ హెచ్‌ఎం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కారంపూడి: స్థానిక ఎంపీపీ మెయిన్ పాఠశాలలో సోమవారం 'శుభ్‌దిన్ భోజన్' కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ ఎస్టీ సెల్ అధ్య క్షుడు, పాఠశాల చైర్మన్ బాలునాయక్ తన తండ్రి వాగ్యనాయక్ జ్ఞాప కార్థం విద్యార్థులకు భోజనం అందజేశారు. కార్యక్రమంలో కటికల బాలకృష్ణ, మస్తాన్‌జానీ, ఎస్‌పీఆర్ కృష్ణ, కాసుల శంకర్, బర్మానా యక్, హెచ్‌ఎం పుల్లమ్మ పాల్గొన్నారు.

రెంటచింతల : మంచికల్లు గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులు 152 మందికి 'శుభ్‌దిన్ భోజన్' కార్యక్రమంలో భాగంగా స్వీట్లు అందచేశారు. ముఖ్య అతిధిగా హాజరైన మంచికల్లు గ్రామ ఉపసర్పంచ్ గోగుల పుల్లారెడ్డి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. పశర్లపాడు గ్రామంలోని పాఠశాలలో ఎంఈవో2 శివనాగేశ్వరరావు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమం లో హెచ్‌ఎం వీర వసంతకుమారి, షిలార్, అహ్మద్, రామిరెడ్డి పాల్గొన్నారు.

సత్తెనపల్లి రూరల్ : మండలంలోని రెంటపాళ్ళ, పెద మక్కెన జడ్పీ హైస్కూల్లో శుభ్‌దిన్ భోజన్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా విద్యా శాఖ అధికారి ఎం.వెంకటేశ్వర్లు పాల్గొని విద్యార్థులకు భోజనం వడ్డిం చారు. ఈ కార్యక్రమం విజయంతం కావడానికి ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరావు, పాఠశాల హెచ్‌ఎం గోపరాజు బసవరాజు, ఏ రాఘవేంద్ర, గ్రామ పెద్దలు మక్కపాటి రామచంద్రరరావు, చెన్నమల్లు వెంకయ్య, టీ శివరావు, ఏకుల రాజశేఖర్, మందడపు సాంబశివరావు, మక్కపాటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు: స్థానిక ప్రభుత్వ మోడల్ స్కూల్లో శుభ్‌దిన్ భోజన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మేరీసుజన్ మాట్లాడుతూ అనంతవరం గ్రామానికి చెందిన మండల టీడీపీ సీనియర్ నేత ధూళ్ళ సాంబశివరావు తయారు చేయించిన స్వీట్లను విద్యార్థులకు అందించినట్లు తెలిపారు.

పెదకూరపాడు : మండలంలోని రామాపురం మండల పరిషత్ పాఠశాలలో 'సుభ్‌దిన్ భోజన్' కార్యక్రమంలో భాగంగా చార్టెడ్ ఎకౌంటెంట్ గడ్డిపాటి సుధాకర్ సహకారంతో విద్యార్థులకు స్వీట్లు, ఫ్రూట్స్‌ను పంపిణీ చేశారు. మండలంలోని గారపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో తెలుగు యువత నియోజకవర్గ నేత మక్కెన సాగర్ ఆధ్వర్యంలో విద్యార్థులక పెరుగు అన్నం ఏర్పాటు చేశరు. ఈ కార్యక్రమాల్లో గారపాడు గ్రామ సర్పంచ్ మేడా రమణ, టీడీపీ గ్రామ అధ్యక్షులు పొదిలి కోటేశ్వరరావు, కొండమీద శ్రీనివాసరావు, ఎంఈవో సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో టీడీపీ నేతలు, దాతలు విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.

నకరికల్లు: ప్రభుత్వ పాఠశాలల్లో దాతల భాగస్వామ్యంతో శుభ్‌దిన్ భోజన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ విద్యా విధానం నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శిక్షాసప్తాహ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా చేజర్ల జడ్పీ హైస్కూల్లో ప్రజల, దాతల భాగ స్వామ్యంతో శుభ్‌దిన్ భోజన్ కార్యక్రమం నిర్వహించారు. నకరికల్లు జెడ్పీ హైస్కూల్‌లో, నకరికల్లు మండల ప్రాథమిక పాఠశాలలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షేక్ పాహిమ్, నగేష్, ఉపాధ్యాయులు ఎల్ లలిత, పీ మాలిక, సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎస్‌కే మస్తాన్‌వలి, గేరా మోహనరావు, ఏసీహెచ్ వెంకటరావు, బత్తుల సుందరరావు, షేక్ గౌస్, నకరికల్లులో బత్తిన శ్రీనివాసరావు, షేక్ అలీ ఆషా పాల్గొన్నారు.



, తాడువాయిలోని సంద్ర తండాలో సుభ్‌దిన్ భోజనాన్ని విద్యార్థులకు వడ్డిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎస్‌కే జానీ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

ఎస్సీ, ఎస్టీ, బీసీలు అన్నింటా వెనుకంజే..

- బీఎస్పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ పూర్ణచంద్రరావు

మాచర్లటౌన్, జూలై 29: పల్నాడు ప్రాంతంలో అగ్రవర్ణాల ఆధిప త్యంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు అన్నింటా వెనుకంజలోనే ఉన్నారని బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్, విశ్రాంత డీజీపీ డాక్టర్ జే.పూర్ణ చంద్రరావు అన్నారు. సోమవారం పట్టణంలోని సూర్యకిరణ్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో నిర్వహించిన బీఎస్పీ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ప్రధాన రాజకీయపార్టీలు అగ్రవర్ణాలకు చెందిన వారికి టిక్కెట్లు ఇవ్వడంతో బడుగు, బలహీన వర్గాలు ఓటు బ్యాంకుగానే మిగిలి పోయారన్నారు. బలహీనవర్గాల మధ్య గొడవలు సృష్టిస్తూ అగ్రవర్ణాల వారు రాజకీయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాచర్ల నియోజకవర్గంలో ఆక్రమణకు గురైన భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి, అధికార ప్రతినిధి ఎల్.వందనకుమార్, జిల్లా అధ్యక్షుడు బాబురావు, ఇన్‌చార్జి డాక్టర్ సైదులు యాదవ్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

మాచర్ల రూరల్, జూలై 29: మండలంలోని తాళ్లపల్లి ఎలిమెంటరీ పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజన పథకాన్ని సర్పంచ్ పసు పులేటి బ్రహ్మనాయుడు పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజ నంలో నాణ్యత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట పంచాయతీ సెక్రటరీ వెంకట్రామయ్య, బట్టి సత్యనారాయణ, అమర నాగేశ్వరరావు, పగడాల నాగేశ్వరరావు, చింతకాయల ఆంజనే యులు, వెంకటేష్‌నాయక్, కొండ బ్రహ్మయ్య, కోరబోయిన రామా రావు, సంతోష్‌కుమార్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

కారంపూడి, జూలై 29: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ అమీర్ హెచ్చరించారు. ఆదివారం రాత్రి మండలంలోని మిర్యాలలో ఆయన పల్లెనిద్ర నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అమిర్ గ్రామస్థులతో మాట్లా డుతూ ఫ్యాక్షన్ గొడవల్లో దూరి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. శాంతి భద్రతలపరంగా ఎటువంటి సమస్యలు వచ్చినా ప్రజలకు పోలీస్‌శాఖ అండగా ఉంటుందన్నారు. పోలీసులకు, ప్రజ లకు మధ్య సత్సంబంధాలు నెలకొల్పేందుకు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అలజడులు సృష్టించే వారిపై తమకు సమాచారం అందిచాలని ఎస్ఐ అమీర్ కోరారు. కార్యక్ర మంలో పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పలువురు పాల్గొన్నారు.

పెట్రోలు చోరీకి యత్నం

మాచర్ల రూరల్, జూలై 29: పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఇద్దరు వ్యక్తులు పెట్రోలు దొంగిలించేందుకు యత్నించారు. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో స్కూటీపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు రైల్వేస్టేషన్ రోడ్డు వీధిలో ఇంటి ముందు నిలిపి ఉంచిన ద్విచక్రవాహనం నుంచి పెట్రోల్ తీస్తున్నారు. అసమయంలో అటుగా వస్తున్న వారిని చూసి సగం పెట్రోలుతో ఉన్న బాటిల్‌ను అక్కడనే వదిలేసి పరారయ్యారు. పెట్రోల్ చోరీ ఘటనంతా ఇంటి ముందున్న సీసీ కెమెరాలో నమోదైంది.

దుర్గిలో పారిశుధ్య పనులు

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన అధికారులు

దుర్గి, జూలై 29: మండల కేంద్రమైన దుర్గిలో పారిశుధ్యం అధ్వా న్నంగా ఉండడంపై సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'దుర్గిలో అధ్వానంగా పారిశుధ్యం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికా రులు స్పందించారు. ఇందిరమ్మ కాలనీ, హైస్కూల్, చర్చి ఆవరణలో నిల్వ ఉన్న చెత్తాచెదారం తొలగించారు. గ్రామంలో దోమలు వృద్ధి చెందకుండా హైపోక్లోరైడ్, బ్లీచింగ్ స్ప్రే చేశారు. అలాగే ముటుకూరు రోడ్డులో నీరు నిలిచి బురదమయంగా ఉండడంతో నూతనంగా సైడు కాలువలను ఏర్పాటు చేశారు. పంచాయతీ అధికారులతో పాటు టీడీపీ నేత సూరే కృష్ణ పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈసంద ర్భంగా ఎంపీడీవో గుప్త మాట్లాడుతూ పారిశుధ్య పనుల నిర్వహణకు గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఆ కమిటీలో పంచాయతీ సెక్రటరీ, ఇంజనీరింగ్ సెక్రటరీ, ఆశావర్కర్, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నట్లు తెలిపారు.



పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న సిబ్బంది

పథకాలకు మహనీయుల పేర్లు

- సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జూలై 29 : విద్యా పథకాలకు కూటమి ప్రభుత్వం మహనీయుల పేర్లు పెట్టిందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగనన్న విద్యా కానుక స్థానంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్రగా, జగనన్న గోరు ముద్ద స్థానంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంగా, జగనన్న ఆణిముత్యాల స్థానంలో అబ్దుల్‌కలాం ప్రతిభా సేవా పుర స్కారంగా పేర్లు మార్చిందన్నారు. విద్యార్థుల్లో స్ఫూర్తి కలిగేలా ప్రభుత్వ పథకాలకు పేర్లు మార్చటం అభినందనీయమన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఈ సందర్భంగా తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కారంపూడి, జూలై 29: కారంపూడి మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కారంపూడి సబ్‌స్టేషన్‌లో 33కేవీ బ్రేకర్ పనులు నిమిత్తం విద్యుత్ సర ఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు

ఆగస్టు 5లోగా దరఖాస్తు చేసుకోండి

రెంటచింతల,జూలై 29: రాష్ట్ర,జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఆగస్టు 5 లోగా దరఖాస్తు చేసుకోవాలని సత్తెనపల్లి డీవై ఈవో ఏసుబాబు కోరారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు 2024 రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రాథమిక, ప్రాథ మికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ఎంఈవో కార్యాలయంలోను, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు డీవైఈవో కార్యాలయంలో వారి దరఖాస్తులను అందచేయాలన్నారు. బోధనలో కనీసం 15ఏళ్ల అను భవం, రాష్ట్ర అవార్డుకు గతంలో జిల్లాస్థాయి అవార్డు పొంది ఉండా లని, క్రిమినల్ కేసులు, ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ శాఖాపర క్రమశిక్షణా చర్యలు ఉండకూడదని డీవై ఈవో తెలిపారు.

మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి

కారంపూడి, జూలై 29: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావర ణాన్ని కాపాడాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య కోరారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని మోడల్ స్కూల్‌తో పాటు పలు పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామస్థులకు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నయీమ్, వైస్ ప్రిన్సిపాల్ శుభశ్రీ, అధ్యాపకులు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

మాచర్లటౌన్, జూలై 29: పట్టణంలోని పురపాలక సంఘ కార్యాల యంలో మంగళవారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించ నున్నట్లు చైర్మన్ చిన ఏసోబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. అధికారులందరూ హాజరుకావాలని కోరారు.

7న బల్లకట్టు నిర్వహణకు వేలం

మాచవరం, జూలై 29: మండలంలోని గోవిందాపురం కృష్ణానదిపై నిర్వహిస్తున్న బల్లకట్టు వేలంపాటలు ఆగస్టు 7న గుంటూరులోని జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించ నున్నట్లు ఎంపీడీవో సురేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బల్లకట్టు నిర్వహణ ఎనిమిది నెలలకు గానూ ఈ వేలం నిర్వహి స్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనవలసిందిగా కోరారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనాన్ని తింటున్న టీడీపీ నాయకులు

బెల్లంకొండ, జూలై 29 : మండలం లోని చంద్రాజుపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో టీడీపీ నేతలు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సోమవారం టీడీపీ జిల్లా పార్లమెంట్ బీసీ ప్రధాన కార్యదర్శి ఓర్సు రాంబాబు, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు, మరి కొంత మంది టీడీపీ నాయకులు పాఠశాలకు వెళ్లి విద్యార్థు లతో కలసి మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా ఆరగించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు మెను ప్రకారమే మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులకు అందించాలని నిర్వాహకు లకు సూచించారు. గత ఐదు సంవత్స రాల వైసీపీ పాలనలో విద్యార్థులకు రుచి కరమైన ఆహారాన్ని అందించ లేదని వారు ఆరోపించారు. అందుకే ప్రతి నెల ఒక్కొక్క సారి పాఠశాలకు వెళ్లి తాము మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తామని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా విద్యార్థులకు మంచి విద్యను అందించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఓర్సు రాంబాబు, లక్ష్మయ్య, శ్రీనివాస రావు, గుంజా శివ, చంద్రాజుపాలెం టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా మెలగండి

- పల్లె నిద్ర కార్యక్రమంలో పిడుగురాళ్ల సీఐ వెంకట్రావు

పిడుగురాళ్ల, జూలై 29: గ్రామస్థులు ప్రతి ఒక్కరు శాంతియుత వాతావరణంలో మెలుగుతూ గ్రామాన్ని అభివృద్ధి చేసుకునే దిశగా అడుగులు వేయాలని పిడుగురాళ్ల సీఐ ఎస్ వెంకటరావు తెలిపారు. గుత్తికొండ గ్రామంలో ఆదివారం రాత్రి ఆయన పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో సీఐ వెంకటరావు మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలో వున్నా గ్రామాన్ని అభివృద్ధి చేసుకునే విధంగా రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు ఒకరికొకరు సహకరించుకుంటూ ఎటువంటి గొడవలకు ఆస్కారం లేకుండా వుండాలని సూచించారు. ఎన్నికల వరకే రాజకీయాలని, తర్వాత ప్రతి ఒక్కరు గ్రామాభివృద్ధి కోసమే సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యడ్లపల్లి నారాయణ, బండ్ల జోగయ్య, యడ్లపల్లి శివ, సుభాని, అంజనేయులు, మస్తాన్‌వలి, గ్రామస్థులు పాల్గొన్నారు.

రమేష్ అకాల మృతి తీరని లోటు

పెదకూరపాడు, జూలై 29 : రమేష్ అకాల మృతి వారి కుటుంబానికి, టీడీపీకి తీరని లోటు అని జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ వర ప్రసాదు సోమవారం అన్నారు. పెదకూరాడు మండలంలోని పాటిబండ్ల గ్రామానికి చెందిన టీడీపీ నేత పాటిబండ్ల రమేష్(38) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. పాటిబండ్లలోని రమేష్ మృతదేహాన్ని టీడీపీ రాష్ట్ర నేతలు వెన్నా సాంబశివారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, మండల టీడీపీ నేతలు మద్దినేని వెంకట సత్యనారాణ, మాజీ ఎంపీటీసీ టీడీపీ జిల్లా కార్యనిర్వాహణ కార్యదర్శి షేక్ ముంతాజ్, పలువురు నివాళులర్పించారు.

మధ్యాహ్నభోజన పథకం పేరు మార్పుపై హర్షం

కారంపూడి, జూలై 29: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ ఆలోచన మేరకు మధ్యాహ్న భోజన పథకాన్ని డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకంగా ప్రభుత్వం అమలు చేస్తుండడంపై జనసేన నేతలు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రమైన కారంపూడిలోని జిల్లా ప రిషత్ హైస్కూల్‌లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న ఆహార పథకం కింద జనసేన నేతలు విద్యార్థులకు ప్రత్యేక భోజనాన్ని వడ్డించారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో నిత్య అన్నదాతగా ప్రసిద్ధి చెందిన డొక్కా సీతమ్మ పేరును మధ్యాహ్న భోజన పథకానికి పెట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌క ల్యాణ్, విద్యా శాఖా మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్ర మంలో పాలెపోగు బాబు, మిర్యాల అశోక్, కొండా పవన్, పలిశెట్టి వినయ్ గణేష్ (పండు) తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

నీటి విడుదలపై రైతులు హర్షం

సత్తెనపల్లి, జూలై 29 : శ్రీశైలం డ్యామ్ నుంచి నీరు విడుదల చేయటంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని టీడీపీ నేతలు తెలిపారు. సోమవారం స్థానిక ఎన్‌టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నీటి విడుదల రైతులకు ఎంతో ప్రయోజనంగా ఉంటుందన్నారు. వరి, మొక్క జొన్న పంటలు ఎక్కువగా రైతులు సాగు చేసుకోవటానికి అవకాశం ఉందన్నారు. నాగార్జున సాగర్ కుడి కాలువ నుంచి కూడా ప్రభుత్వం నీటిని విడుదల చేస్తుందన్నారు. టీడీపీ కూటమి అధికారం చేపట్టిన దగ్గర నుంచి రాష్ట్రంలో వర్షాలు పుష్కలంగా కురుస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి రైతాంగానికి మేలు చేస్తారన్నారు. రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర అన్ని విధాలా సహకరించేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు, నాయకులు కొనికినేని సత్యనారాయణ, కట్టా రమేష్, పీలా సాంబశివరావు, గుత్తా రామారావు తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

బెల్లంకొండ, జూలై 29 : బెల్లంకొండ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సోమవారం అదే గ్రామానికి చెందిన మాబూ అనే రైతుకు చెందిన రూ.50 వేలు విలువ చేసే గేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. యజమాని మాబూ తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే గేదెను పొలానికి తీసుకు వెళ్లి మేపుతుండగా విద్యుత్ స్తంభం వద్దకు వెళ్ళగానే విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందిందని తెలిపారు. గత పది రోజుల క్రితం నుంచి ఆ విద్యుత్ స్తంభం వద్ద విద్యుత్ సరాఫరా అవుతుందని విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళినప్పటికీ వారు పట్టించుకోలేదని, విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తన గేదె చనిపోయిందని, తనకు తగు పరిహారం ఇప్పించి న్యాయం చేయాలని మాబూ కోరాడు.

31న కౌన్సిల్ సమావేశం

సత్తెనపల్లి, జూలై 29 : ఈనెల 31వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3:30 గంటలకు పురపాలక సంఘ సాధారణ సమావేశం జరుగుతుందని చైర్‌పర్సన్ ఎలినేడి లక్ష్మీ తులసీ సోమవారం విలేకరులకు తెలిపారు. కౌన్సిల్ సభ్యులంతా సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

అధిక ధరకు విక్రయిస్తే ఫిర్యాదు చేయండి

రాజుపాలెం, జూలై 29: మండలంలోని ఏదైనా విత్తనాలషాపులో విత్తనాలను అధిక ధరకు విక్రయిస్తే తమకు ఫిర్యాదు చేయాలని మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటనరసయ్య రైతులను కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న విత్తనాల షాపుల్లో అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు అందటంతో సోమవారం ఆయన మండలం లోని అన్ని విత్తనాల షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా షాపుల్లో రికార్డులను పరిశీలించటంతో పాటు విత్తనల విక్రయాలపై స్థానిక రైతులను విచారించారు. ఎవరైనా అధిక ధరలకు విత్తనాలు విక్రయిం చినట్లు తెలిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పల్నాడు వార్తలు



అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్ బాబు తదితరులు

సమస్యలను అధిగమించి ప్రగతి సాధించాలి

● కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట టౌన్, జూలై 29: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న సమస్యలను అధిగమించి ప్రగతి సాధించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు అన్నారు. సోమవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో 96మంది అర్జీదారులు ఫిర్యాదులు అందజేశారు. ప్రజల నుంచి అర్జీలను జిల్లా కలెక్టర్‌తో పాటు డీఆర్‌వో, డీఆర్‌డీఏ పీడీ, వివిధ శాఖల జిల్లా అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీ అరుణబాబు మాట్లాడుతూ శ్రద్ధ, అంకితభావంతో పనిచేసి జిల్లాను ఉన్నత స్థానంలో నిలపాలని అన్నారు. ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని పనులు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని మండలాల ప్రత్యేక అధికారులు వారానికి ఒక్కరోజు సచివాలయాలు, పాఠశాలలు, హాస్టళ్లలో, రైతు సేవా కేంద్రాలు, ప్రభుత్వాసుపత్రులు తనిఖీలు చేసి సమస్యలు గుర్తించి పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలన్నారు, క్షేత్రస్థాయిలో శాఖలకు సంబంధించిన అంశాలపై సమీక్షించుకోవాలన్నారు. ఆయా హెచ్‌వోడీలు పీజీఆర్ఎస్ పోర్టులలో చూడని అన్ని కేసులను క్లియర్ చేయాలన్నారు. మీమీ శాఖలలో కింద స్థాయి సిబ్బందితో సమన్వయంతో పనిచేసుకొని శాఖపై ప్రతి అంశంపై అవగాహనతో ముందుకు సాగాలని ఆదేశించారు.

అర్జీదారులకు అన్నదానం

నరసరావుపేట టౌన్, జూలై 29: పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని కలెక్టర్, ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారులకు అన్నదానం చేశారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అత్తులూరి సుబ్బారావు, మాజీ కౌన్సిలర్ గట్టుపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఏఎస్పీ రామ చంద్రరాజు, మాజీ కౌన్సిలర్ వాసిరెడ్డి రవి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమానికి నిడమానూరి శివరాంప్రసాద్ సహకరించారు.



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదుల వెల్లువ

నరసరావుపేట లీగల్, జూలై 29: పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి కార్యక్రమంలో ఎస్పీ కంచి శ్రీనివాసరావు పాల్గొని బాధితుల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. నకరికల్లు మండలం రూపెనగుంట గ్రామానికి చెందిన పొట్టి సౌమ్యకు పట్టణంలోని ఓ బ్యాంకులో పనిచేస్తున్న దుద్దెల శివరామకృష్ణ రూ.50000 లోన్ ఇప్పిస్తానని చెప్పి ఇంటి పన్ను కాగితం, కరెంటు బిల్లు తీసుకొని బ్యాంకులో రూ.1,50,000 ఇప్పించి బ్యాంకు నుంచి బయటకు వచ్చిన తర్వాత తాను లక్ష రూపాయలు తీసుకొని రూ.50వేలు మాత్రమే ఇచ్చి నోటు రాసి ఇస్తానని చెప్పి మోసం చేసినట్లు ఫిర్యాదు చేసింది. పట్టణంలోని క్రిస్టియన్‌పేటకు చెందిన మల్లవరపు విజయలక్ష్మి తన భర్త ఆకాష్ బాబుకు సబ్‌ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం వస్తుందని పెళ్లి చేసుకుని మోసగించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పెదకూరపాడు గ్రామానికి చెందిన కొర్రపాటి సాలమ్మ తన కూతురుకు కట్నంగా ఇచ్చిన ఐదు సెంట్ల స్థలంలో ఇల్లు నిర్మించుకుంటుండగా, ఆమె కొడుకు కోడలు కొట్టి బయటకు నెట్టేసి ఇబ్బంది పెడుతున్నట్లు ఫిర్యాదు చేశారు ఫిర్యాదులు చేయడానికి వచ్చిన ప్రజలకు ఫిర్యాదును రాసి పెట్టడంలో పోలీస్ సిబ్బంది సహకరించారు ఈ సందర్భంగా ఫిర్యాదుదారులకు మధ్యాహ్నం భోజనాన్ని పోలీసు అధికారులు వడ్డించారు కార్యక్రమంలో క్రైమ్ ఎస్పీ ఎస్‌బీసీఐలు ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు

గోవిందాపురం మైనరు కాల్వకు మరమ్మతులు

'ఆంధ్రజ్యోతి'కి స్పందన

నరసరావుపేట రూరల్, జూలై 29: మండలంలోని లింగంగుంట్లలోని గోవిందాపురం మైనరు కాల్వ నుంచి నీరు కట్టలు పొంగి కాలనీలలో ఇళ్లమధ్యకు నీరు వస్తుండటంపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఎన్‌ఎస్పీ అధికారులు స్పందించారు. సోమవారం గోవిందాపురం మైనరులో పేరుకుపోయిన గుర్రపుడెక్క, చెత్తను పొక్లెయిన్ సాయంతో తొలగించారు. కాలవ కట్టలపై చిల్లచె ట్లు, కాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించేందుకు వ్యయం అంచనావేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు.

వెల్లటూరులో శిక్షా సప్తాహ్

బొల్లాపల్లి, జూలై 29: మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు శిక్షా సప్తాహ్ భోజనం దాతలకు బేతపూడి వెంకటేశ్వర్లు, షేక్ కాలీషా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

షాదీఖానా నిర్వహణలో అవకతవకలపై విచారణ చేయాలి

నరరావుపేట టౌన్, జూలై 29: నరసరావుపేట పట్టణం ప్రకాష్‌నగర్‌లో ఉన్న షాదీఖానా నిర్వహణలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని మాజీ కౌన్సిలర్ షేక్ జానీ మౌలాలీ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా సమస్యల ప్రజావేదిక కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పీ అరుణ్‌బాబు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా షేక్ జానీమౌలాలీ మాట్లాడుతూ తహసీల్దార్ కన్వీనర్‌గా నిర్వహణ కమిటీ ఉందన్నారు. అయితే తహసీల్దార్ స్థానంలో డిస్ట్రిక్ట్ మైనారిటీ ఆఫీసర్‌ను నియమించారన్నారు. బరోడా బ్యాంక్ ఖాతాలో రూ.12,12,299లు అప్పటి డీఎండబ్ల్యూవో, కమిటీ వారు విడతల వారీగా షేక్ మహబూబ్ సుభానీ పేర చెక్కులు ఇచ్చి ఉపసంహరింపజేశారని, ఆ పైకం మొత్తంపై విచారణ చేసి జరిగిన అవకతవకలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు సంఘం శరణం గచ్ఛామి నృత్యరూపక నాటకం

నరసరావుపేట కల్చరల్, జూలై 29: ప్రజా నాట్య మండలి వారిచే స్థానిక ప్రకాష్ నగర్‌లో ఉన్న భువనచంద్ర టౌన్ హాల్‌లో నేటి సాయంత్రం 6 గంటలకు అంబేద్కర్ జీవిత చరిత్రను తెలిపే సంఘం శరణం గచ్ఛామి నృత్య రూపక నాటకం ప్రదర్శించనున్నారు. హైదరాబాద్, అభ్యుదయ ఆర్ట్స్ ఆకాడమీ వారు ఈ నాటకాన్ని ప్రదర్శిస్తున్నారని ప్రజా నాట్యమండలి వారు చెప్పారు. పట్టణంలోని కళాభిమానులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు ప్రదర్శన తిలకించాలని వారు కోరారు.

నర్సరీ యాజమానులు లైసెన్స్‌లు తీసుకోవాలి

బొల్లాపల్లి, జూలై 29: మండలంలోని వెల్లటూరు, పేరూరుపాడు, సరికొండపాలెం గ్రామాల పరిధిలో ఉన్న షేడ్ నెట్ నర్సరీలను సోమవారం ఉద్యానవన శాఖ అధికారి నబీ రసుల్లా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీ నిర్వాహకులు నర్సరీ చట్టం 2010 ప్రకారం నర్సరీ లైసెన్స్ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. నర్సరీ లైసెన్స్ కోసం షేడ్ నెట్ చుట్టూ తొమ్మిది నుంచి 14అడుగుల ఎత్తు వరకు, ఇన్‌ఫ్యాక్ట్ ప్రూఫ్ నెట్‌తో రక్షణ కల్పించాలన్నారు. షేక్ నెట్ హౌస్‌లో డబుల్ డోర్ సిస్టమ్ కలిగి ఉండాలన్నారు. కీటకాలు లోపలకు ప్రవేశించకుండా ఉండటానికి నెట్ ఎక్కడా కూడా రంధ్రాలు లేకుండా చూసుకోవాలన్నారు. లైసెన్స్‌లను తప్పనిసరిగా రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జీ కోహిని, నర్సరీ యజమానులు పాల్గొన్నారు.



షేడ్ నర్సరీల లైసెన్స్ రెన్యూవల్ పత్రాన్ని అందిసున్న ఉద్యానవన శాఖ అధికారి నబీ రసుల్లా

హాస్టల్‌లో సంక్షేమం కరువు

- విద్యార్థులకు అరకొరగా ఆహారం
- విధులకు హాజరు కాని వార్డెన్
- కమాటీలకు బదులు అన్ని బాధ్యతులు వాచ్‌మేన్‌వే
- పట్టించుకోని జిల్లా సాంఘీక సంక్షేమ అధికారులు
- క్యాటరింగ్ పనులకు వెళుతున్న విద్యార్థులు



సిద్ధార్థనగర్‌లోని సాంఘీక సంక్షేమ బాలుర కళాశాల హాస్టల్



వంట సిద్ధం చేస్తున్న వాచ్‌మన్ రాజు



నిల్వ ఉన్న మే నెల నాటి రేషన్ బియ్యం

వినుకొండ టౌన్, జూలై 29: విద్యార్థులకు ఆశ్రయం కల్పించి ఆదరించాల్సి సంక్షేమ హాస్టల్‌లో సంక్షేమం కరువైంది. విద్యార్థుల అవసరాలను తీర్చాల్సిన వార్డెన్ గత రెండేళ్లుగా అందుబాటులో లేదు. వినుకొండ పట్టణంలోని సిద్ధార్థ నగర్‌లో ఇంటర్, డిగ్రీ, ఐటీఐ చదివే విద్యార్థుల కోసం నాలుగు సంవత్సరాల క్రితం సాంఘీక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని అధికారులు ఏర్పాటుచేశారు. అక్కడ కొందరు విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవడినట్లు ఆరోపణలు ఉన్నాయి. వార్డెన్ రాక, వంటోళ్లు లేక, ఔట్‌సోర్సింగ్ వాచ్‌మెన్ అంతా తానై వ్యవహరిస్తున్నాడు. నెలకు రూ.45 వేలు వెచ్చించి, సుమారు 14 గదులను ప్రభుత్వం అద్దెకు తీసుకుని హాస్టల్ కొనసాగిస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన హాస్టల్ వార్డెన్ కృపాదానం రెండేళ్ళ క్రితం పదవీ విరమణ చేయడంతో, గుంటూరుకు చెందిన ప్రకాశరావును నూతన వార్డెన్‌గా అధికారులు నియమించారు. ఆయన వినుకొండలో విధులు నిర్వహించాల్సి ఉండగా, ఆయన గుంటూరు నుంచి అప్పుడప్పుడు వచ్చి కనిపించి వెళ్తారు. కనీసం విద్యార్థులకు బయోమెట్రిక్ వేసిన దాఖలాలు లేవు. ఎంతమంది హాస్టల్‌లో ఉంటున్నారో వాచ్‌మెన్‌కు తెలియని పరిస్థితి. మే నెలలో రేషన్ నేటికి కొనసాగిస్తున్నారు. కనీసం మెనూ బోర్డులు పెట్టరు. ఖాళీ కడుపులతో కాలం గడపాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. గత ప్రభుత్వం హయాంలో వినుకొండలోని వైసీపీ నాయకులు అండతో వార్డెన్ విధులకు హాజరు కావడంలేదని, జిల్లా అధికారులు సైతం, మామూళ్ల మత్తుకు అలవాటుపడి పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. గత కొంత కాలంగా హాస్టల్‌లోని పరిస్థితులతో కొత్తవారు హాస్టల్‌లో చేరేందుకు భయపడుతున్నారు. హాస్టల్ గోడలపై పిచ్చిరాతలు, పగిలిపోయిన తలుపులు, విరిగిపోయిన బల్లలు, రుచిలేని భోజనంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పగలంతా విద్యార్థులు, వాచ్‌మేన్ రాజుతో కలిసి, పట్టణంలో జరిగే ఫంక్షన్‌లకు, క్యాటరింగ్ పనులకు వెళ్లి, పొట్ట నింపుకుంటున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా, అధికారులు హాస్టల్‌ను సందర్శించి వెనుకబడిన విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించి, గాడితప్పుతున్న హాస్టల్‌ను గాడిలో పెట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

మెమోలు ఇచ్చాం: సంతోష్

హాస్టల్ దుస్థితిపై సాంఘీక సంక్షేమ డివిజనల్ అధికారి సంతోష్‌ను సంప్రదించగా వార్డెన్ అందుబాటులో లేకపోవటంపై గతంలో మెమోలు కూడా ఇచ్చామని, నా పరిధిలో హాస్టల్‌ను విజిట్‌చేసి వాస్తవాలను జిల్లా స్థాయి అధికారులకు తెలియజేస్తానని తెలిపారు.

హాస్టల్ ఖాళీ చేయాలి: బిల్డింగ్ యజమాని సుభానీ

గతంలో హైస్కూల్ కోసం అన్ని వసతులతో బిల్డింగ్ నిర్మించానని హాస్టల్ బిల్డింగ్ యజమాని సుభానీ మాస్టర్ తెలిపారు. అనివార్య కారణాలతో హైస్కూల్ పెట్టలేదని, ఖాళీగా ఉంటే హాస్టల్‌కు అద్దెకు ఇచ్చానన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం బిల్డింగ్‌ను అద్దెకు ఇచ్చానని, ఖాళీ చేయాలని అధికారులకు కోరుతున్నట్లు ఆయన తెలిపారు.

తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



సింగర చెరువులో నీటిని పరిశీలిస్తున్న జీవీ ఆంజనేయులు, అధికారులు

వినుకొండ టౌన్, జూలై 29: పల్నాడులో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. వినుకొండ పట్టణానికి తాగునీరు సరఫరా చేసే 3 సింగర చెరువులను సాగర్ జలాలతో నింపారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు, మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణితో కలిసి సోమవారం సింగర చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ వినుకొండ పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేస్తామన్నారు. పల్నాడులో తాగునీటికి పడుతున్న ఇబ్బందులను గ్రహించి భారీ నీటి పారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్ళామని, నాగార్జునసాగర్ డ్యామ్, డెడ్ స్టోరేజ్‌లో ఉన్నప్పటికీ కుడికాలవకు తాగునీటిని విడుదల చేసి, సాగర్ జలాలతో చెరువులకు తాగునీటిని నింపామన్నారు. స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసేందుకు ఫిల్టర్ బెడ్లను మార్చడం జరిగిందని, రోజు మార్చి రోజు పట్టణ ప్రజలకు తాగునీటిని విడుదల చేస్తామన్నారు. ప్రజలు తాగునీటిని వృథా చేయ కుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వినుకొండలో తాగునీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని, 159కోట్ల నిధులతో తాగునీటి పథకాన్ని పూర్తిచేయడం జరుగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ చెరువులో నీటి సామర్థ్యం తగ్గగానే ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సందర్శించి తాగునీటి సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి, కుడి కాలువకు నీటిని విడుదల చేయించి పల్నాడు ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కృషి అభినందనీయమని తెలిపారు. సింగర చెరువుతో పాటు, నియోజకవర్గంలోని తాగునీటి చెరువులను నీటితో నింపి ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ వెంకయ్య, టీడీపీ నాయకులు పఠాన్ ఆయూబ్‌ఖాన్, పీవీ సురేష్, పత్తి పూర్ణ, వంకాయలపాటి పేరయ్య, పి.కృష్ణ, మురికిపూడి నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు: డీఎంహెచ్‌వో

నరసరావుపేట లీగల్, జూలై 29: చట్టాన్ని ఉల్లంఘించి లింగ నిర్ధారణ పరీక్షలను ఏ స్కానింగ్ సెంటర్ నిర్వాహకులైన చేసినట్లయితే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా డీఎంహెచ్‌వో పీసీపీ ఎన్డీటీ అడ్వైజరీ కమిటీ చైర్మన్ డాక్టర్ బి రవి సోమవారం తెలిపారు. జిల్లా స్థాయి సమావేశం సోమవారం జిల్లా డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ జిల్లాలో కొత్తగా ఏడుస్టాండ్ సెంటర్లు రెన్యూవల్స్ మూడు, ఎనిమిది మార్పుల కోసం లింగ నిర్ధారణ చట్టం కింద నమోదు చేసుకున్నారన్నారు. వీటన్నిటిని తనిఖీలు నిర్వహించి కలెక్టరు అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు జిల్లాలో ఇప్పటివరకు 164 ఆసుపత్రులు లింగ నిర్ధారణకు అనుమతులు పొందాయని, వీరందరూ చట్ట ప్రకారం రికార్డులను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గీతాంజలి ఎం పద్మావతి కే మురళీకృష్ణ కే సాంబశివరావు లక్ష్మణరావు డాక్టర్ గిరిబాబు డాక్టర్ శోభారాణి అంకమ్మ, ధర్మ సింగ్ శాస్త్రి ప్రవీణ్ రెడ్డి ప్రసాద్ నాయక్ సాయి వినీత్ శివకుమారి, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు

కర్లపూడి వీఆర్‌వో సస్పెన్షన్

నరసరావుపేట, జూలై 29: అమరావతి మండలం కర్లపూడి గ్రామ రెవిన్యూ అధికారి ఏ రమేష్‌ను సస్పెండ్ చేస్తూ సోమవారం కలెక్టర్ అరుణ్‌బాబు ఉత్తర్వులు జారీచేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, ఇసుక లారీల నుంచి అధిక మొత్తంలో డబ్బు డిమాండ్ చేసినట్లు విచారణలో తేలడంతో రమేష్‌ను సస్పెండ్ చేశారు.

విద్యార్థులకు అతిసార వ్యాధిపై అవగాహన

వినుకొండ, జూలై 29: మండలంలోని ఏనుగుపాలెంలోని ఎంపీయూపీ పాఠశాలలో అతిసార వ్యాధిపై విద్యార్థినీ, విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రమణనాయక్ మాట్లాడుతూ విద్యార్థులు చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఏమైనా అతిసార వ్యాధి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలన్నారు. పాఠశాలల్లో ఫస్టు ఎయిడ్ బాక్స్ ఏర్పాటు చేస్తామని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ ప్రభాకర్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఎలీషా, మురళీకృష్ణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సాయిచందు, ఏఎన్‌ఎం దేవిక, అంగన్‌వాడీ కార్యకర్త కస్తూరి, యేసునిత్య, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

భ్రమరా టౌన్‌షిప్‌లో మౌలిక వసతులు కల్పించాలి

● ఎమ్మెల్యే జీవీకి ఓనర్సు అసోసియేషన్ నాయకుల వినతి

వినుకొండ, జూలై 29: మార్కాపురం రోడ్డులోని భ్రమరా టౌన్‌షిప్‌లో మౌలిక వసతులు కల్పించాలని భ్రమరా ఓనర్సు అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులను కలిసి సోమవారం వినతిపత్రం అందచేశారు. దీనిపై ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు స్పందించి భ్రమరా టౌన్‌షిప్‌లో మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రజినీ, శేషగిరిరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించాలి

● నేచురల్ హెల్త్‌కేర్ సొసైటీ సీఈవో భగవాన్‌దాస్

శావల్యాపురం, జూలై 29: గ్రామీణ ప్రాంతాల్లోని డ్వాక్రా మహిళలు చేతివృత్తుల ద్వారా అదనపు ఆదాయాన్ని సాధించేందుకు కృషి చేయాలని నేచురల్ హెల్త్‌కేర్ సొసైటీ సీఈవో నూకతోటి భగవాన్‌దాస్ అన్నారు. నాబార్డు సహకారంతో నేచురల్ హెల్త్‌కేర్ సొసైటీ వారి ఆధ్వర్యంలో శావల్యాపురం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 30మంది డ్వాక్రామహిళలకు ఎల్‌ఈడీ బల్బుల తయారీపై ఉచిత శిక్షణను సోమవారం ప్రారంభించారు. మండల సమాఖ్య సీసీ ఖాజా, శిక్షణ నిపుణులు లాజర్, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

పీఎం విశ్వకర్మ యోజన దరఖాస్తులను పరిశీలించాలి

● కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట రూరల్, జూలై 29: ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద జిల్లాలో ఇప్పటివరకూ అందిన దరఖాస్తుల పరిశీలన రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకూ జిల్లాలో అందిన 52,112 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పూర్తిచేయాలన్నారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం కమిటీ ద్వారా పథకానికి అర్హులను ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి (ఇంచార్జి) సుధాకర్, ఎల్డీఎం రాంప్రసాద్, డీఆర్డీఏ పీడీ బాలు నాయక్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సంజీవ్ రావు, డీపీఆర్వో ఓంప్రకాశ్ రెడ్డి, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ సత్యప్రసాద్ పాల్గొన్నారు.

అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు: ఏడీఏ

నరసరావుపేట రూరల్, జూలై 29: వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఎరువులు, విత్తనాలు అధిక దరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వ్యవసాయ శాఖ ఏడీఏ పి.మస్తానమ్మ తెలిపారు. సోమవారం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సిహెచ్ రవికుమార్ నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ స్టేషన్ రోడ్ లోని విత్తన దుకాణాలను తనిఖీచేశారు. ఎంఆర్‌పీ రేట్ల కంటే అధిక ధరలకు ఎవరైనా అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రవికుమార్ తెలిపారు. విత్తనాలు తీసుకున్న రైతులు తప్పనిసరిగా బిల్లును తీసుకోవాలని కోరారు. అదేవిధంగా బిల్లు బుక్‌లో రైతులు సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. దుకాణాల వద్ద ధరలతో బోర్డును తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి: ఎంఈవో

ఈపూరు, జూలై 29: పాఠశాలల్లో మధ్యాహ్నం విద్యార్థులకు పెడుతున్న భోజనంలో పోషకాలు ఉండేలా చూడాలని, అప్పుడే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఎంఈవో-2 రామతులసి అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని అంగలూరు, గోపువారిపాలెం గ్రామాలలో శుభదాన్ భోజన్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పలావు, చికెన్ వడ్డించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోనుగుంట్ల శ్రీనివాసరావు, టీఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షుడు నర్రా కిశోర్, టీడీపీ నాయకులు దొడ్డా ప్రసాదు, బొల్లా రమేష్, నర్రా రాజ్యం, సుబ్బారావు, మునుగోటి మల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోగులపాడు జడ్పీ పాఠశాలలో డీవైఈవో తనిఖీ

రొంపిచర్ల, జూలై 29: మండలంలోని గోగులపాడు జడ్పీ పాఠశాలను డీవైఈవో వేణుగోపాలరావు సోమవారం తనిఖీచేశారు. శిక్ష సప్తాహ కార్యక్రమంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేశారు. ఆహార నాణ్యతను పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హనుమంతరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రత్తిపాటికి సమస్యలను వివరిస్తున్న శివ ప్రియ నగర్ వాసులు

శివప్రియ నగర్ సమస్యలను పరిష్కరించరూ..

● ప్రత్తిపాటికి కాలనీవాసుల వినతి

చిలకలూరిపేట, జూలై 29: పట్టణంలోని శివప్రియ నగర్‌లో పలు సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు సాయపడాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును సోమవారం ఆ కాలనీకి చెందిన పలువురు కలసి విన్నవించారు. శివ ప్రియ నగర్‌లో పార్కు స్థలం వివాదంలో ఉన్నదని, అక్కడి ప్లాట్లకు సంబంధించి కూడా వివాదాలు ఉన్నాయని వారు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అక్కడ గృహాలు నిర్మించుకునేందుకు వీలుగా తాగునీరు, విద్యుత్, రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. మౌలిక వసతి సౌకర్యాలు కల్పిస్తే అక్కడ తక్షణం గృహాలు నిర్మించుకుంటామని వారు వివరించారు. ప్లాట్లకు వేసిన రోడ్లను పలువురు ఆక్రమించారని, వాటిని తొలగించాలని కూడా విన్నవించారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ శివ ప్రియ నగర్ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని, అక్కడి సమస్యల పరిష్కారం విషయంలో అండగా ఉంటానన్నారు. ఆ కాలనీ వాసుల వెంట పలు సంఘాల నాయకులు కూడా పుల్లారావును కలిశారు. పుల్లారావును కలసిన వారిలో ఏ వీరాంజనేయులు, పేలూరి రామారావు, దివ్వెల సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

కొత్తపాలెం గ్రామ సర్పంచ్‌కు ప్రత్తిపాటి నివాళి

యడ్లపాడు, జూలై 29: యడ్లపాడు మండలం కొత్తపాలెం గ్రామ సర్పంచ్ మొలమంటి వెంకటసుబ్బారావు అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం సుబ్బారావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలియచేశారు. అలాగే మైదవోలు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నక్కా రాజారావు భార్య అనారోగ్యంతో మృతిచెందగా ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రాజారావుకు, కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. లింగారావుపాలెం మాజీ సర్పంచ్ నల్లపనేని గంగయ్య ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. స్థానిక టీడీపీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ప్రత్తిపాటి గంగయ్య నివాసానికి వెళ్ళి పరామర్శించారు. గంగయ్య ఆరోగ్యం గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల టీడీపీ అధ్యక్షుడు కామినేని సాయిబాబు, ఆయా గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

జవహర్ నవోదయలో శాస్త్రీయ వైజ్ఞానిక ప్రదర్శన



నవోదయలో వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకిస్తున్న ప్రిన్సిపాల్, అతిథులు

చిలకలూరిపేట, జూలై 29: చిలకలూరిపేట మండలం మద్దిరాలలోని జవహర్ నవోదయ విద్యాలయంలో రెండు రోజుల పాటు జరిగే క్లస్టర్ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన సోమవారం ప్రారంభమైంది. రాష్ట్రంలోని శ్రీకాకుళం నుంచి గుంటూరు జిల్లా వరకు గల మొత్తం తొమ్మిది నవోదయ విద్యాలయాలకు చెందిన 63మంది విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. వివిధ అంశాలల్లో వారు తయారుచేసిన నమూనాలను ఈ సందర్భంగా ప్రదర్శించారు. క్లస్టర్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపికచేసి ప్రాంతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు పంపటం జరుగుతుందని ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నల్లూరి నరసింహారావు తెలిపారు. ముఖ్య అతిథులుగా సీఆర్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ధనలక్ష్మి గ్రూపు సంస్థల డైరెక్టర్ లింగయ్య చౌదరిలు పాల్గొన్నారు.

తైక్వాండోలో చైతన్య లిటిల్స్ విద్యార్థుల ప్రతిభ

చిలకలూరిపేట, జూలై 29: గుంటూరులో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో చాంపియన్స్‌లో స్థానిక చైతన్య లిటిల్స్ స్కూల్ విద్యార్థులు మంచి ప్రతిభ చూపి పలు పతకాలు సాధించారు. ఐదుగురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. వారిలో ఎం గార్గిచౌదరి, పీ నిహారిక, బీ పద్మకాంత్, ఏ శ్రీగణేష్ తేజ, ఎం ధనుష్, ఎస్‌కే హనీఫా, డీ కైలాష్ శ్రీ సాయి బాలాజీ బంగారు పతకాలు సాధించారు. ఇంకా ఐదుగురు రజత పతకాలు, మరో ఐదుగురు కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం స్కూల్ ఆవరణలో సంస్థ డైరెక్టర్ ఈదర గిరీష్‌బాబు ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించి వారిని ప్రశంసించారు. వారు సాధించిన పతకాలు, సర్టిఫికెట్లు భవిష్యత్‌లో స్పోర్ట్స్ కోటా కింద పరిగణిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గైడ్ టీచర్ అనూరాధయ్య, ప్రిన్సిపల్ డీవీ లక్ష్మి, ఏవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో జాకీర్ హుస్సేన్

సామాజిక తనిఖీలకు సహకరించాలి: ఎంపీడీవో

నాదెండ్ల, జూలై 29: గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనులు, పంచాయతీరాజ్ పింఛన్ల పంపిణీ తదితర పనులకు సంబంధించి నిర్వహించే సామాజిక తనిఖీల్లో పాల్గొనే సభ్యుల బృందానికి సహకరించాలని ఎంపీడీవో జాకీర్ హుస్సేన్ కోరారు. నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సామాజిక తనిఖీలకోసం వచ్చిన బృందంతో పాటు ఆయా శాఖలకు చెందిన సిబ్బంది, కార్యదర్శులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఉపాధి హామీ పథకం పనులపై తనిఖీలు నిర్వహించనున్నట్టు ఎస్ఆర్‌పీ లోకేశ్ తెలిపారు. ఈ తనిఖీలు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని వారు తెలిపారు. సమావేశంలో ఎంపీపీ తలతోటి రాణి, ఉపాధి ఏపీవో పుష్పరాజ్, ఏఈ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైదవోలులో పల్లె నిద్ర కార్యక్రమం



మైదవోలు గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ బాలకృష్ణ

మైదవోలు (యడ్లపాడు), జూలై 29: పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి గొడవలకు వెళ్ళకుండా శాంతియుత వాతావరణంలో జీవించాలని యడ్లపాడు ఎస్ఐ బాలకృష్ణ అన్నారు. మండలంలోని మైదవోలు గ్రామంలో శనివారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్థులతో సమావేశమైన ఎస్ఐ మాట్లాడుతూ గ్రామస్థులు ఎలాంటి తగాదాలకు పోకుండా స్నేహభావంతో కలసిమెలసి, హింసకు తావులేకుండా చూసుకోవాలన్నారు. సమస్యాత్మక గ్రామాలు అభివృద్ధిలో వెనుకబాటుకు గురవుతాయని, శాంతియుత వాతావరణంలో మాత్రమే అభివృద్ధికి వీలుంటుందన్నారు. గ్రామంలో సమస్యలు తలెత్తితే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలే తప్ప అనవసరంగా గొడవలకు దిగొద్దన్నారు. గొడవలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని, కఠిన శిక్షలు ఉంటాయన్నారు. మైనర్ బాలికల విషయంలో తల్లిదండ్రులు తగుజాగ్రత్తలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు వారి చర్యలను గమనిస్తూ ఉండాలని సూచించారు. అలాగే ఆన్లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, అత్యాశతో మోసానికి గురికావద్దన్నారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, అలా ఇస్తే వారి తల్లిదండ్రులు శిక్షార్హులవుతారన్నారు. కొత్త చట్టాలు, నేరాలకు పాల్పడితే వేసే శిక్షల గురించి ప్రజలకు వివరించారు. ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే స్టేషన్‌కు రావాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.